పునర్జన్మ



1875 అపరశంకరుడు 1914

శ్రీ బెల్లంకొండ రామరాయ కవీంద్రులు

PUNARJANMA - 1955 -------- SOCIAL DRAMA.

AUTHOR :

BELLAMKONDA RAMA DASU.

FIRST EDITION :-1956.

SECOND EDITION :- 1981.

DIGITAL EDITION :- 2011.

Digitaliesed by : -

BELLAMKONDA CHAKRADHAR KUMAR.

.(BROTHER SON TO AUTHOR).

ADDRESS :-

BELLAMKONDA RAMA RAYA KAVINDRA TRUST.

PRAKASH NAGAR.

NARASARAO PET -522601.

CELL NO'S :- 9700311109 & 9866400133.


BELLAMKONDA CHAKDRADHAR KUMAR, NRT



BELLAMKONDA VENKATA
SUBRAMANYA SARMA.



BELLAMKONDA
SRINIVASASARMA



BELLAMKONDA
CHAKRADHAR KUMAR.

పునర్జన్మ

పునర్జన్మ

ఆంధ్ర నాటక కళాపరిషత్ వారి

ప్రథమ బహుమతి పొందిన నాటకం

బెల్లంకొండ రామదాసు

ఫోన్ : 72186

దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

కాంగ్రెస్ ఆఫీస్ రోడ్ • విజయవాడ-2

దేశీ ప్రచురణ
పునర్ముద్రణ
ఏప్రిల్, 1981
D. P. L. No. TCIVA/101

వెల: రు. 4-00



ప్రతులకు:
దేశీ బుక్ హౌస్,
నారాయణగూడ, హైదరాబాద్-29.
ఫోన్: 220451

ముద్రణ:
శ్రీ లక్ష్మీ ప్రింటర్స్,
విజయవాడ-3

పరిచయం

శ్రీ బెల్లంకొండ రామదాసుగారు రచించిన 'పునర్జన్మ' నాటకాన్ని ఉదయనీ థియేటర్స్‌వారు ప్రదర్శించగా చూచాను. రేడియో వారోత్సవాలలో విజయవాడ శాఖవారు ప్రసారం చేయగా విన్నాను.

పతితయైన యువతి తన జీవితం చక్కదిద్దుకుని మర్యాదగా బ్రతకాలని చేసేకృషికి వచ్చే ఆటంకాలు, ఆమెను పాడుచేసిన భ్రష్టుడు తిరిగి బురదలోనికి ఈడ్వడానికి చేసే ప్రయత్నాలు, వివాహం చేసుకొన్న భర్త మలినమైన ఆమె పాతచరిత్రను తెలిసికొని పొందే మానసికబాధను రచయిత పదనుగా చిత్రించారు.

అందుచేత నాటకప్రదర్శన రక్తికట్టింది. సంభాషణలు పాత్రోచితంగా నడచి శ్రోతలను తన్మయులను చేశాయి. సంగీతం కొరతపడినా ప్రేక్షకుల మన్నన పొందింది.

పూర్వగాథ: యువతీ యువకులకుండే సహజోద్రేకంలో ఇరుగు పొరుగునవుండే రాంకుమార్-శ్యామలలు ప్రేమించామనుకుంటారు. ముందువెనుకలు ఆలోచించకుండా ఇళ్ళు వదలి పట్నం చేరుతారు. కొంతకాలం వినోదంగా కాలం గడుపుతారు. వెంటతెచ్చుకున్న నగలు, ధనం హరించుకుపోతాయి. మోజు తరిగిపోతుంది. జీవితంలో ఎదుర్కోవలసి వచ్చే ఆర్థిక ఇబ్బందులు దాటలేక తగవులాడుతారు. చేతగానితనంతోపాటు మగవాని అహంకారం ప్రకోపించి. రాంకుమార్ ప్రియురాలినికొట్టి, ఆమె గతికి ఆమెను వదలి లేచిపోతాడు.

దిక్కులేని శ్యామల బాకీపడిన ఇంటద్దె చెల్లించలేక వదలివేస్తుంది. పనికొరకు, బ్రతుకుతెరువుకొరకు అన్వేషించుతుంది. ఎచట చూసినా అవమానాలు పొందుతుంది. తిరిగి తిరిగి తిండిలేక చివరకు శోషవచ్చి ఒక ఇంటిముందు పడిపోతుంది. ఆశ్రయమిచ్చి, తిండిపెట్టి పోషించిన ముసలిది దిక్కులేని ఆ యువతిని పడుపువృత్తిలోకి దించుతుంది. ఆ నికృష్టబ్రతుకు గడపలేక, జీవితంపై ఏవగింపుగలిగి పడుపు కొంపనుండి శ్యామల పారి

పోతుంది. వెంటపడిన అల్లరిమూకనుండి తప్పించుకోడానికి ఒక యింటి తలుపు తడుతుంది.

తలుపు తెరచిన డాక్టరు మూర్తి కలవరపడుతున్న ఆమెకుఆశ్రయ మిచ్చి ఆపదనుండి రక్షించుతాడు. క్రమంగా వారిపరిచయం అభిమానంగా మారుతుంది. శ్యామల తన పాతచరిత్రను చెప్పాలని ప్రయత్నించుతుంది. కాని“నాకు కావలసింది నీవు. నీ చరిత్రకాదు” అని డాక్టరు అడ్డుపడతాడు. వివాహానంతరం స్వగ్రామం తీసుకుపోతాడు. ఇదంతా నాటకానికి పూర్వ గాథ_వివిధ పాత్రలచేత సందర్భానుసారంగా రచయిత చెప్పించుతారు.

డాక్టరు మూర్తి జనార్ధనరావనే సంపన్నుని కుమారుడు. తల్లిలేని పిల్లవైన మూర్తిని, చిన్నను జనార్దనరావుగారు గారాబంగా పెంచుతారు. మూర్తి కాలేజీలో చదువుతూంటే తానొక్కడూ ఇంట్లో చిన్నకు చదువు చెప్పించుతూ కాలం గడుపుతారు. మూర్తి డాక్టరుపరీక్ష ప్యాసయి వివాహా నంతరం స్వగ్రామం వస్తున్నాడు. ఇంటివద్ద వారి రాకకొరకు ఎదురు చూస్తున్న జనార్ధనరావు, చిన్నలతో ప్రథమరంగం ప్రారంభమౌతుంది. ఉబ్బసరోగియైన మామగారికి జాగ్రత్తగా నర్సుచేసి శ్యామల ఆయన ఆప్యాయతను సంపాదించుతుంది. నర్సింగ్ నేర్చుకుని డాక్టరుకు వృత్తిలో చేదోడుగా వుంటుంది. వదినా మరదళ్ళ నవ్వులాటలు, కలుపుగోలుతనంతో కుటుంబజీవితం సంతోషంగా సాగిపోతుంటుంది. చిన్నను తీర్చిదిద్దుతూ, తన జీవితంలోని విషాదగాథలను మరచిపోవడానికి, తన్నాదరించినకుటుం బానికి సేవచేస్తూ శ్యామల నవ్యజీవితం సాగించుతుంటుంది.

వైద్యమనే సాకుతో రాంకుమార్ డాక్టరు మూర్తి ఇంటికి వస్తాడు. సవ్యంగా సాగిపోతున్న ఆ కుటుంబ జీవితంలో తుఫాను లేపుతాడు. తాను మలినంచేసి వదలిపోయిన శ్యామల తిరిగి సుఖంగా వుండడం చూసి ఓర్వ లేడు. గతచరిత్రను చెపుతానని బెదిరించి ఆమెను లొంగదీయాలని ప్రయత్నించుతాడు. నిరాకరించినదన్న దుగ్ధతో డాక్టర్ మూర్తికి ‘ఫొటో అల్బం’ ఇవ్వడంద్వారా ఆ సంసారంలో నిప్పులు పోస్తాడు.

భర్త మనస్సు కలత చెందుతుంది. కులటను చేపట్టినందుకు పరువు మర్యాదలు పోతాయని బాధపడతాడు. శ్యామల తనను మోసగించిందనే సందేహం కలిగి ఆమెనే అడుగుతాడు. ఆమె తన పాత చరిత్రను చెప్ప సంకల్పించినప్పుడల్లా మూర్తి ఎలా నివారించాడో శ్యామల నిరూపించుతుంది. రాంకుమార్‌ను డాక్టర్ వెళ్ళగొడతాడు. క్లబ్‌లో మకాంపెట్టి వాడు మరింత అల్లరి చేస్తాడు.

డాక్టర్ ఊళ్ళోవారి నిందలకు తట్టుకోలేడు. పిచ్చివాడిలా ప్రవర్తించుతాడు. జీవితానుభవం తెలిసిన తండ్రి "ఆ అమ్మాయి పూర్వజీవితం దగ్ధమైందనుకో! పునర్జన్మ ప్రారంభించిందనుకో!" అని కుమారునికి ధైర్యం చెపుతాడు. ఇదే నాటకానికి మకుటంగా స్వీకరించబడింది.

కథలో జిగి వుంది. చివరిసీనులో బలవంతం చేయవచ్చిన రాంకుమార్‌ను శ్యామల కాల్చడంవంటి ఘటన అవసరం కన్పించదు. కుమారునికి నచ్చచెప్పి ఇంటికి తీసుకువచ్చిన తండ్రి ఠీవిగా భ్రష్టుని 'పోరా' అని సాగనంపితే మరింత హుందాగా వుండేది.

సంభాషణలు కొలదిచోట్ల దీర్ఘంగావుండి వాగ్వాదధోరణి అనిపించింది. శిథిలమవుతున్న పాతకు మొలకలెత్తుతున్న అభ్యుదయ భావాలకు మధ్య జరుగుతున్న సంఘర్షణను నాటకం చక్కగా చిత్రించింది. మూర్ఖత్వానికీ, ఛాందసానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని కళాన్వితంగా రచయిత నిరూపించారు. కాని, అసూయ, ద్వేష, కావేషాలపైన మూర్ఖత్వంపైన జరిపే విమర్శలో, ఆక్షేపణలలో ఒకటి రెండుచోట్ల సంఘంపై విసుర్లుగాకూడా దొర్లాయి. అవి రచయిత సరిచేసుకుంటారని ఆశించుతాను.

ఉదాత్తమైన కథావస్తువుతో, ప్రజానురంజకమైన నాటకాన్ని రచించినందులకు శ్రీ బెల్లంకొండ రామదాసుగారికి అభివందనాలు. ఆంధ్ర ప్రజానీకం ఈ నాటకాన్ని సముచితంగా ఆదరించుతుందని ఆశించుతాను.

విజయవాడ
15–8–1956

మద్దుకూరి చంద్రశేఖరరావు,
విశాలాంధ్ర.

ఒక చిన్నమాట

అనుకోకుండా చేసిన పనుల్లో ఇది ఒకటి— 'పునర్జన్మ' వ్రాయడం.

అంటే శ్యామలమ్మ మనసులో మెదలడంలేదని కాదు. కొన్నాళ్ళ నుంచి మరపు—తలపు—ఉభయ సంధ్యల నడుమ మనకచీర కట్టి దోబూచులాడుతూనే ఉంది. కాని 'కథ' సింగారించుకుని కళ్ళకు కట్టలేదు. ఆడబడుచుల స్వభావం అదని అడుగు బైటపెట్టడానికి ఉలికిపడుతుందేమో నని అలాగే ఊరుకున్నాను.

మనిషి బొమ్మకన్న మనసులో బొమ్మ మధురం. కాబట్టి మనసు తీరికైన సమయాల్లో దాన్నే జ్ఞప్తిచేసుకుంటూ నెమరులోనే నిద్రపోయాను. అప్పుడప్పుడు అడుగుల సవ్వడి వినిపించి తిరిగి చూసేసరికి తుర్రున పరు గెత్తి మరపు మందిరంలో గడియపెట్టుకుని నిద్రించేది.

'అమ్మాయి యిష్టంవచ్చినప్పుడే వస్తుంది'- అని నేనైతేమటుకు అది ఎంత చెప్పరానిపనులు చేసిన గడుసుదైనా-కన్నకడుపు తీపికొద్దీ ఊరుకొన్నాను. కాని—నలుగురినోళ్ళలో దానికథ పడేస్తే ఎక్కడ విల విలలాడుతుందోనని— మిత్రులు కృష్ణారావు, మూర్తి, తిలక్ ఊరు కున్నారా? దానికథ నలుగురి నోళ్ళలో పడేస్తే – చేసిన పాపం చెప్పతే పోతుందన్నట్టు—గడియలు పగులకొట్టి—అమ్మాయిని వెలుపలికి రమ్మ న్నాను. అప్పుడు ఇహ తప్పదని తన కథనంతా మూటకట్టుకుని వచ్చి ఎదురుగా నిల్చొంది.

నాకు భయమే సుమండీ—ఇలాంటి పిల్లను—పెద్దలకు చూపడం. అయినా అందులోనూ అందని అందం వుందని చూపక తప్పిందికాదు. కాని అదిమాత్రం సామాన్యురాలా? తనకేమీ మచ్చలేనట్టూ, కనేవారి కళ్ళ లోనే మచ్చవున్నట్టూ, ప్లీడరీ పాసైనదానిలా వాదనకొచ్చింది. జానకీ దేవిలా తలవంచి ఇలలోకి వెళ్ళలేదు—భర్త ఆ మూడుముక్కలూ అడిగి

నప్పుడు అతనెంత బేలవాడో జ్ఞాపకంచేసి, కోప్పడి, చివాట్లేసి, నిజంచెప్పి, కాళ్ళట్టుకుని, చివరకు చేతులకు నెత్తురుపూసుకుని, మరపురాని ఇల్లాలై ఇంటినంతా వెలిగించి హైదరాబాద్‌నూ, బెజవాడనూ, మదరాసునూ– మూడు ముఖ్యనగరాలనూ ఒకకొలిక్కి తెచ్చింది.

శకుంతలల్లే 'హా'అని మూర్ఛాపోలేదు, సీతలా తల్లి కడుపుచేరనూ లేదు. మగని కాళ్ళపట్టి మగనిచేతనే కాళ్ళపట్టించింది—పాతకాలపు మామగారి మనసూ మచ్చికచేసుకుంది. కడకు, తనకష్టాల కడలికి కారకు డైనవానికి–ఏ కోర్టులతోనూ అవసరంలేకుండా తనే గ్రాండ్‌గా శిక్ష వేసేసింది—ఇది అమ్మాయి కథ.

అమ్మాయికథ నాచేత ఆదరంతో వ్రాయించిన మిత్రులు శ్రీ కృష్ణా రావు, మూర్తి, తిలక్‌గార్లకూ, లోకోత్తరంగా ప్రదర్శించిన 'ఉదయనీ థియేటర్స్' నటీనటులు—మూర్తి, నిర్మల, శర్మ, వెంపటి, బేబీనరుసు, ప్రసాద్, చలపతిరావు, సుబ్బారావుగార్లకు సదా కృతజ్ఞత.

రేడియో ఉత్సవాలలో ఈ నాటకమును రంగప్రయోగం గావించిన ఏ. ఐ. ఆర్. విజయవాడవారికి—అడిగినంతనే ఆదరంతో పరిచయం వ్రాసియిచ్చిన శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారికి సదా నా కృతజ్ఞత.

అమ్మాయి తప్పులు మన్నించిన ప్రేక్షకులకూను.

సెలవు.

బెల్లంకొండ రామదాసు

పునర్జన్మ

ఒకటవ రంగం

[తెర లేచేసరికి మూర్తి భవనంలో ముందుహాలు కనిపిస్తుంది. హాలు విశాలంగా ఉంటుంది. సోఫాలు, కుర్చీలు, హాలులో నుంచి లోపలికి వెళ్ళే తలుపులు, హాలు మధ్యగోడకు మూర్తి తల్లి—మహాలక్ష్మమ్మగారి ఎన్‌లార్జిమెంటు, ఒకప్రక్క వీణ, రాజారామమోహనరాయ్, వీరేశలింగంపంతులు, టాగూర్, గాంధీ మొదలయినవారి పటాలు వుంటాయి....]

చిన్న : నాన్నా! నాన్నా! వచ్చేశాం నాన్నా!

[మూర్తి తండ్రి—జనార్ధనరావు లోపలినుంచి వస్తూ]

జనా : అన్నయ్యా, వదినా ఏరే?

చిన్న : వచ్చేశారు. వాళ్ళూ వచ్చేశారు నాన్నా! అన్నయ్య దార్లోదిగి వదినకు ఆస్పత్రి చూపిస్తున్నాడు. వదిన వచ్చిన తరువాత యింత వరకూ ఆస్పత్రి పూర్తిగా చూళ్ళేదుకదూ!

జనా : సామానులేవీ?

చిన్న : కార్లో ఉన్నాయి. నరసన్న తెస్తున్నాడు.

[నరసన్న పెట్టె, బెడ్డింగ్, పూల పండ్లబుట్టలు తీసుకువస్తాడు]

జనా : అబ్బాయి ఏడీ నరసన్నా ?

నర : వస్తున్నారయ్యా. అమ్మగారు ఆస్పత్రి చూస్తున్నారు.

[నరసన్న లోపలకు వెళతాడు]

జనా : చిన్నా! కొండమీద మన బంగళా ఎలావుందే?

చిన్న : బంగళాకేం నాన్నా! హాయిగావుంది. నేను చిన్నప్పుడు బంగళా తోటలో నాటాను చూచావ్ — గులాబీమొక్క — ఇప్పుడు పెరిగి యింతదైంది నాన్నా! అన్నయ్యే, వదినకి మన పొలాలన్నీ చూపించాడు. మన తోటలన్నీ చూపించాడు. మన రైతులందరూ అన్నయ్యనూ, వదిననూ చూచి సీతా, రాముడూ అన్నారు. మన కొండమీద కొత్తగా వెలిశాడుచూచావ్ నాన్నా!

జనా : ఎవరే?

చిన్న : వేయిన్నర వెండిబిందెల పానకాల నరసింహస్వామి. గుళ్లోకివెళ్ళి నేనూ, వదినా, అన్నయ్యా పెద్దపూజ చేయించాం నాన్నా! పదహారు బిందెల పానకం బైటికి రాలా!.... నిజంగా నాన్నా!

జనా : పూజారి తాగాడా? దేముడు తాగాడా?

చిన్న : దేముడేనాన్నా! దేముడునోట్లో పెద్ద బిలం ఉన్నదట. వదినా అన్నయ్య చెయ్యిపెట్టి చూశారుగా! వదిన దేముడినోట్లో చేయి పెడుతుంటే అన్నయ్య 'జాగ్రత్త! లోపల బూచిఉంది' అన్నాడు. వదిన కెవ్వున కేకేసి అన్నయ్యను బల్లిపిల్లలా కరుచుకుంది.... నిజంగా నాన్నా!

జనా : అప్పుడు నువ్వేంచేశావ్ ?

చిన్న : నేను దేముడికి మొక్కుకున్నానుగా-మా అన్నయ్యకి ఒక మంచి కొడుకుపుడితే మా కొబ్బరితోటలో కాయలన్నీ నీకే కొడతానని....

[శ్యామల, మూర్తి ప్రవేశిస్తారు]

అరుగో అన్నయ్యా, వదినా.

[వారికి అడ్డంవచ్చి]

ఆగండి, మీరు లోపలికి రావడానికి వీల్లేదు.

జనా : ఏమిటే చిన్నా ?

చిన్న : అవును నాన్నా! వదినకు దిష్టితీసెయ్యొద్దూ? వదినగారు కొత్త పెళ్ళికూతురని అందరూ అదేపనిగా చూచారు. ఉండండి. దిష్టి నీళ్ళు పట్టుకొస్తా....

[లోనికి వెడుతుంది]

మూర్తి: ఏమిటేచిన్నా! దిష్టెందుకే ?

జనా : అవునురా. ఇంటి ఆడబడుచు, దానిమాట కెదురేముంది?

[చిన్న నీళ్ళుతెచ్చి దిష్టితీసి, నరసన్నకు ఇస్తుంది.
నరసన్న బయట పారబోసి లోపలికి వెళతాడు]

చిన్న : ఇహ రండి వదినా! కుడికాలు పెట్టు. ఊఁహూఁ—వుండండి.

మూర్తి: మళ్ళీ ఏమిటే?

చిన్న : పేర్లు చెప్పండి.

మూర్తి: పెళ్ళై రెండు నెలలయితే యిప్పుడు పేర్లేమిటి పిచ్చిపిల్లా!

చిన్న : ఇంట్లో ఎప్పుడు అడుగుపెట్టితే అప్పుడు చెప్పాల్సిందే. చెప్పన్నయ్యా!

మూర్తి: ముందు మీ వదిన్ను చెప్పమను.

చిన్న : చెప్పు వదినా!

శ్యామ : ఉఁహుఁ. మీ అన్నయ్యనే చెప్పమను.

చిన్న : చెప్పన్నయ్యా!

మూర్తి: ఉహుఁ. మీ వదిన్నే చెప్పమను.

చిన్న : అబ్బబ్బ! ఎప్పుడూ పిలుచుకునే పేర్లు చెప్పటానికి ఏం సిగ్గుపడతార్రా నాయనా! ఆడపిల్లలకు సిగ్గుకదూ! నీవే చెప్పన్నయ్యా!

మూర్తి: (శ్యామలవైపు తిరిగి) ఆఁ — మరచిపోయాను. నీపేరేమిటి శ్యామలా?

శ్యామ : ఆఁ మరచిపోయాను మీ పేరుచెప్పండి మూర్తిగారూ!

[అంతా నవ్వుతారు]

చిన్న : (చప్పట్లు కొడుతూ)

హియర్, హియర్. ఇహ రండి. వదినా! అందరికీ తక్షణం కాఫీ పెట్టు.

మూర్తి: తండ్రిదగ్గరకు వచ్చి ఒంట్లో ఎలావుంది నాన్నా?

జనా : నాకేం?దిబ్బరొట్టిలా తేనట్రా. మీ డాక్టర్లకు ప్రపంచంలో అందరూ జబ్బుమనుష్యుల్లా కనుపిస్తారేమిట్రా?

శ్యామ : రోజూ మందు తీసుకుంటున్నారా మామయ్యా?

చిన్న : నర్సు లేదుగా మందివ్వడానికి.

మూర్తి: ఎవరే నర్సు?

చిన్న : వదినే నర్సు. వదిన నాకు వదిన, నీకు భార్య, నాన్నకి నర్సు.

మూర్తి: వదినకు మూడు డ్యూటీ లిచ్చావన్నమాట.

జనా : అవునురా. చిన్న చెప్పింది నిజం. అమ్మాయి వచ్చినప్పటినుంచి మీ అమ్మలేని లోటు తీరింది....

[అంతా మూర్తి తల్లి ఫొటోవంక చూస్తారు]

ఆస్పత్రి నర్సులుకూడా అమ్మాయిముందు చాలరు.

చిన్న : అన్నయ్య యిచ్చిన ట్రయినింగేగా.

మూర్తి: మరేమిటనుకున్నావ్ నా ట్రయినింగంటే! ఒక నెలలో మీ వదినను హెడ్‌నర్సు చేసెయ్యనూ!

చిన్న : అప్పుడు నీకు వంట ఎవరు చేస్తారు?

మూర్తి: నువ్వు.

చిన్న : నీ పెళ్ళాం నర్సుపనిచేస్తే. నేను వంటచేస్తా ననుకుంటున్నావా? నేను మాస్టరమ్మపని చేస్తా.

శ్యామ : మంచి మాటన్నావ్!

మూర్తి: పోనీ, వంటమనిషి వుందిగా.

చిన్న : ఆవంట నీకు సయించదంటావుగా?

మూర్తి: పోనీ, నేనే చేసుకుంటాను. శ్యామలా! నాన్నగారికి మిక్చర్ ఇవ్వు. నేను డ్రస్‌చేసుకుని త్వరగా ఆస్పత్రికి వెళ్ళాలి. చిన్నా! నరసన్నను నీళ్ళు కాగాయేమో అడుగు.

[చిన్న లోనికి వెడుతూ]

చిన్న : నీళ్ళు కాగాయా నరసన్నా?

నర : (లోపలనుంచి) కాగాయమ్మా.

మూర్తి: శ్యామలా! నాన్నగారికి మందివ్వు.

[మూర్తి లోనికి వెడతాడు. శ్యామలకూడ లోనికి వెడుతుంది. జనార్ధన రావు పేపరు చూస్తుంటాడు. నరసన్న మూర్తి గదిదగ్గరకు వెళ్ళి]

నర : బాబూ! స్నానానికి రావచ్చు. (లోనికి వెడతాడు)

జనా : అమ్మాయ్ శ్యామలా!

శ్యామ : (ప్రవేసిస్తూ) ఏం మామయ్యా?

[శ్యామల ప్రవేశిస్తుంది. ఔన్సు గ్లాసులో మందు, వెండి గిన్నెలో బత్తాయితొనలు వుంటాయి.]

జనా : అమ్మాయ్! శ్యామలా! ఈ పేపరు వార్తలు చూస్తుంటే తల తిరిగి పోతోందమ్మా. ప్రపంచం ముందునుంచి వెనుకకు పోతోందా, వెనుకనుంచి ముందుకు పోతున్నదా అనిపిస్తోంది.

శ్యామ : ఏం జరిగింది మామయ్యా ?

జనా : చూడు ఈ వార్త. ఒక వెధవభార్య ఒక భర్తను చంపాడట.

శ్యామ : ఏమిటి మామయ్యా?

జనా : (మరింత ఉద్రేకంతో) ఈ వెధవభర్త ఒక భార్యను చంపిందట.

శ్యామ : (నవ్వుతుంది)

జనా : అదా అమ్మాయ్! మరచాను. భర్త భార్యను చంపాడట అదీ.

శ్యామ : చంపితే చంపాడు. కాని మీరు మందు పుచ్చుకోండి.

జనా : ఎందుకమ్మాయ్ మందు?

శ్యామ : ఉబ్బసం తగ్గటానికి.

జనా : అసలు నాకు ఉబ్బసంలేదు, జబ్బూలేదు. ఉన్నా, ఈ ఎర్రనీళ్ళు తాగితే తగ్గుతుందంటావా?

శ్యామ : తప్పకుండా తగ్గుతుంది. మూడుపూటలూ మందిచ్చే బాధ్యత మీ అబ్బాయిగారు నా కిచ్చారు. మీరు మందు పుచ్చుకోకపోతే నేను చీవాట్లు పడాల్సి వస్తుంది.

జనా : సరే. అలా అయితే తప్పకుండా పుచ్చుకుంటాను.

[ఒక్క గుక్కలో మందు తాగుతాడు.]

శ్యామ : బత్తాయి తొనలు తీసుకోండి. (యిస్తుంది)

జనా : అమ్మాయ్! ఇవి మనకేం ఆగుతాయ్. మనకి మందుల్లో మాకుల్లో నమ్మకం లేదు. దిగుడుబావిలో దిగి ముప్పూటలా స్నానంచేసి సవాసేరు గోంగూర పులుసుకూర, ముద్దపప్పూ, జొన్నసంకటి సేవిస్తే ఏ రోగమూ ఉండదు.

శ్యామ : ఆ పనిమాత్రం చేయకండి. మీ అబ్బాయిగారు చన్నీళ్ళస్నానం పనికిరాదన్నారు. గోంగూర పనికిరాదన్నారు. క్యాబేజి, క్యారెట్లు పంపిపెట్టమన్నారు.

జనా : అన్నాడూ! వీడు డాక్టరై నప్పటినుంచి నా దుంపతెగుతోంది. ప్లీడ

తయినా బాగుండేది. కాసేపు వాగి ఊరుకునేవాడు. సరే, కాని... , అమ్మాయ్, శ్యామలా! ఒక్కమాట అడుగుతాను చెప్పు.

శ్యామ : అడగండి మామయ్యా.

జనా : సరిగా ఉన్నమాట ఉన్నట్టు చెప్పాలిసుమా!

శ్యామ : అడగండి.

జనా : నిన్నుచూస్తే మంచిపిల్లలాగే కనిపిస్తున్నావు.... కాని

శ్యామ : కాని....?

జనా : మా అబ్బాయి మంచివాడంటావా? చెడ్డవాడంటావా?

శ్యామ : కన్నవాళ్ళకు మీకు తెలుస్తుందికాని నాకేం తెలుస్తుంది చెప్పండి?

జనా : కన్నవాణ్ని నేనైనా, కట్టుకున్నదానివి నీవేకదమ్మా.

శ్యామ : వారే నన్ను కట్టుకున్నారు. దోవనేపోతుంటే తీగలా తగిలానట!

జనా : అమ్మాయ్ శ్యామలా! మా అబ్బాయిని నీవే కొంచెం కనిపెట్టి వుండాలమ్మా! వాణ్ని నీ చేతుల్లో పెట్టాను.

శ్యామ : ఏం మామయ్యా, అలా అన్నారు?

జనా : అదికాదమ్మా. నీ మంచితనం శంకించి నేను చెప్పడంలేదమ్మా. యింటికోడలివిగాబట్టి యింతగా చెప్తున్నాను. మావాడి మనస్సు అతిసున్నితమయింది. మెత్తని పూవులాంటిది. చిన్న చిరుగాలి వీచినా చలించే రెమ్మలాంటిది. వాడిమనస్సు నాకొక్కడికే తెలుసమ్మా! కన్నది కన్నతల్లేకాని, చేతులారా పెంచింది నేనేనమ్మా! ఈ పసికందుబిడ్డణ్ని వదలి అది వెళ్ళిపోయింది. అంకంత ఈ

కొంపలో ఈ యిద్దరు బిడ్డలతో నేనొక్కణ్ణి - నేనేం కష్టాలు పడ్డానో నాకేతెలుసు. చిన్నమటుకు చిన్న, జోలపాడితేగాని నిద్ర పోయేదికాదు. ఈ పాడుగొంతుతోనే జోలపాడాను. మావాడు పెరిగి పెద్దవాడై చదువుకు వెళ్ళాడు. చిన్నమ్మా, నేనూ అడ దిక్కులేని ఈ ఆస్థిని కనిపెట్టుకుని ఇక్కడేవున్నాము. నేనుకదల డానికి వీల్లేదుకదూ! ఒకప్పుడు ఈ యిల్లు కళకళలాడుతూండేది. అది బ్రతికున్నరోజుల్లో-ఇంటినిండా బంధువులు, అతిథులు, వచ్చే పోయేవారు. ఎప్పుడూ నవ్వులూ, హాస్యాలూ-దీపావళిలాఉండేది. అదిపోయింది-నిశ్శబ్దం, చీకటి. మావాడు చదువు పూర్తిచేసుకొని ఒక ఇంటివాడు ఎప్పుడవుతాడా అని కాచుకొని కూర్చున్నానమ్మా! ఇన్నాళ్ళు నీ రాకకోసమే కనిపెట్టుకొని వున్నానమ్మా. నీవు వచ్చి భారం దించావు. మళ్ళీ ఈ భవనంలోకి దీపావళి వచ్చింది. నవ్వులా, దీపకాంతీ వచ్చాయి. ఈ భవనాన్ని, మా వంశాన్ని వెలిగించాలమ్మా నీవు. మా బ్రతుకులకు ఆధారం నీవేనమ్మా!

[కన్నీటితో కంఠం రుద్ధమవుతుంది.]

శ్యామ : మామయ్యా!

జనా : ఏం లేదమ్మా, ఏదో జ్ఞాపకంవచ్చి....

[చిన్న లోపలనుంచి వస్తూ]

చిన్న : ఏమండోయ్ వదినగారూ! అన్నయ్యగారికి టై కావాలట, గీరల టై.

శ్యామ : వస్తున్నానమ్మా.

[చిన్న, శ్యామల లోపలికి వెళతారు]

[నాగయ్య పరుగెత్తుతూ వస్తాడు]

నాగ : సార్! సార్ డాక్టరుగారున్నారా?

జనా : ఏమిటయ్యా హడావిడి?

నాగ : హడావుడి ఏమిటిసార్, హడలెత్తి చస్తుంటే. అర్జంటు సార్. కేసు సార్. ఒక భర్త భార్యను చంపింది సార్. వాడికి గాయం బలంగా తగిలింది.

జనా : నాపిచ్చి నీకూ పట్టినట్టుందే!

నాగ : పిచ్చేమిటి సార్?

జనా : మరి, భర్త భార్యను చంపిందేమిటోయ్ వెర్రినాగన్నా!

నాగ : అదాసార్, చస్తుంటే ఏ జెండరయితే ఏంలెండి,

[మూర్తి పైజామా సవరించుకుంటూ వస్తాడు. అతనివెంట శ్యామల వస్తుంది.]

మూర్తి : ఏమిటోయ్?

నాగ : అర్జంటు కేస్‌సార్.

మూర్తి : వస్తున్నా-శ్యామలా! మెడిసన్ చెస్ట్.

[శ్యామల మెడిసన్ చెస్ట్ తెస్తుంది]

నాగ : ఇలా ఇవ్వండమ్మా. (తీసుకొంటాడు)

మూర్తి : వస్తానాన్నా! నేను రావడం ఆలస్యమయితే మీరు భోజనాలుకానీండి. శ్యామలా వస్తా.

[కాంపౌండరు నాగయ్య, డాక్టరు వెడతారు]

జనా : అబ్బ! అన్నీ హత్యకేసులే. భర్త భార్యనుచంపడం, భార్యభర్తను చంపడం. ఈ అడవిలో మరీ.

చిన్న: (ప్రవేశిస్తూ) ఎందుకు చంపడం పసితోచక.

శ్యామ: మంచిమాట అడిగావు.

జనా : అనుమానం. అనుమానం హత్యకు దారితీస్తుంది.

శ్యామ: వా రొచ్చేసరికి ఆలస్యమౌతుందేమో, మీరు భోంచేయండి మామయ్యా.

జనా : ఇంతవరకూ కడుపులో ఆకలి కదలదే. దిగుడు బావిలో దిగి దివ్యంగా ఈతకొడితేగాని కడుపులో చురచురలాడదు.

శ్యామ: చన్నీళ్ళస్నానం పనికిరాదు.

చిన్న : గోంగూర పనికిరాదు,

జనా : ఇవాళ ఒక్కరోజుకూ పథ్యంమానేదాం. అమ్మాయ్ శ్యామలా! నేను వెళ్ళి దిగుడుబావిలో ఒక మునక వేసివస్తాకాని, అబ్బాయితో చెప్పకు.

[వెళ్ళబోతాడు]

శ్యామ: మామయ్యా వెళ్ళకండి.

జనా : ఫరవాలేదు. ఒక్కరోజు స్నానానికే ఘటం ఎగరదులే, ఘటం గట్టిది. నేను వచ్చేసరికి వంట సిద్ధంగా వుంచు.

శ్యామ: వంట తయారయింది.

జనా : ఏం చేశారు?

చిన్న : క్యాబేజి, కారెట్స్, జిలేబి.

జనా : అది నీవు, మీ అన్నయ్య, వదినా తినండి. నాకుమాత్రం గోంగూర పప్పు, కొరివికారం, బియ్యసన్నంలేనిదే నోటికి ముద్దెక్కదు. మంగమ్మతో చెప్పి వండించండి.

(వెడుతూ) అమ్మాయ్! శ్యామలా! గోంగూరలో వుల్లిపాయలు మరచిపోకు.... పచ్చిమిరపకాయలుకూడా.... (వెడతాడు)

చిన్న : నాన్నకి పిచ్చి.

శ్యామ: ఆయనకాదు పిచ్చి, అనుకునేవాళ్ళకు పిచ్చి.

చిన్న : పద వదినా. కొత్తవంట మొదలెట్టించాలిగా. ఓ వంటల మంగమ్మా మళ్ళీ మడికట్టుకో. నాన్నకి కొత్తవంట కావాలి.

[ఇద్దరు లోపలికి వెడతారు]

[క్షణం నిశ్శబ్దం, కాలింగ్ బెల్ వినిపిస్తుంది. రాంకుమార్ వస్తాడు. అతనితో బెడ్, హోల్డాల్, ఒకబ్యాగ్ వుంటాయి]

కుమార్: మూర్తిగారిల్లు ఇదేనాండి?.... మూర్తిగారిల్లు ఇదేనాండి?

[చిన్న వస్తుంది]

చిన్న : ఇదే, ఇదే, ఎవరు కావాలి మీకు?

కుమా: ఇంట్లో ఎవరూ లేరా?

చిన్న : లేకేం, అందరం వున్నాం.

కుమా: పెద్దవాళ్ళు....

చిన్న : నాన్న దిగుడుబావికి స్నానానికి వెళ్ళారు. వదిన స్నానంచేస్తోంది. అన్నయ్య ఆస్పత్రికెళ్ళాడు. నేను మీముందు నిల్చున్నాను.

కుమా: You are a nice girl ! ఈ బిస్కట్టు తీసుకో.

చిన్న : మా ఇంట్లో చాలా వున్నాయి.

కుమా: ఓ, నీ వెవరమ్మాయ్?

చిన్న : మూర్తిగారి చెల్లెల్ని.

కుమా: మూర్తిగారు మీ అన్నగారా?

చిన్న : నేను చెల్లెల్ని అయితే ఆయన అన్నకాడూ?

కుమా: ఆఁ, అవునులే. కొంచెము నేనొచ్చానని మీ వదినగారితో చెప్పు.

చిన్న : నేనంటే!

కుమా: నేను మీ వదినగారికి దగ్గర బంధువునులే.

చిన్న : మా వదినగారికి బంధువులు ఎవరూలేరే? అన్నా లేడు తమ్ముడూ లేడు. అక్కాలేదు చెల్లీలేదు. మరిమీరు–మేనమామా?

కుమా: ఆఁ ఆఁ. మేనమామని. కొంచెం వెళ్ళి చెప్పమ్మా.

చిన్న : మీ పేరు?

కుమా: నాపేరు.... రాంకుమార్.

చిన్న : పెద్దపేరే!.... కుమార్ అని చెప్పతాలెండి.

కుమా: అలాగే చెప్పు, చాలు.

[చిన్న లోపలికివెళ్ళి ఒక్క క్షణంలో వస్తుంది

కుమా: వస్తోందా మీ వదిన?

చిన్న : రావడానికి వీల్లేదు.

కుమా: ఏం?

చిన్న : ఏమో నాకు తెలియదు. (చిన్న లోపలికిపోతుంది)

కుమా: నాపేరు గుర్తుపట్టి వుండదు....

[జనార్ధనరావు వస్తాడు]

జనా : నీవేనాబాబూ, మస్తానుసాయిబు జట్కాలో వచ్చింది?

కుమా: నేనేనండీ. తమరు....

జనా : మూర్తి మా అబ్బాయే బాబూ!

కుమా: మూర్తిగారి తండ్రిగారన్నమాట.

జనా : అవునుబాబూ. మా మూర్తి మీకు తెలుసా?

కుమా: తెలీకపోవడ మేమిటండీ. వారి ఆప్తస్నేహితుల్లో ఒకణ్ణి! వారి వివాహ సందర్భంలోకూడా వున్నానండి. ఒక ఏకాంక నాటిక కూడా ప్రదర్శించాం. తమరు చూచే వుంటారు.

జనా : నేను ఒంట్లో బాగుండక రాలేదు బాబూ!

కుమా : అయ్యో! పెద్దఫంక్షన్ మిస్ అయ్యారన్నమాట. ఆ వివాహ వైభవం చూచితీరాల్సిందేకాని, చెప్పనలవికాదండి. చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ కమీషనర్ ఆఫ్ పోలీస్, చీఫ్ మినిస్టర్, పుర ప్రముఖులందరూ విచ్చేశారండి. హోటల్ కెనెమెరాలో వేలవేల విద్యుద్దీపాల కాంతిలో మూర్తిగారిచ్చిన ఆ ఓపెన్ ఎయిర్ డిన్నరుండే ఆ హోటలు చరిత్రలో ఎన్నడూ జరగలేదనుకోండి. ట్రావెన్కూరు సిస్టర్స్ డ్యాన్సుకూడా పెట్టించారు.

జనా : కూర్చోబాబూ. నిల్చునే మాట్లాడుతున్నావ్. ఇంతకూ నీ వెక్కడనుంచి వస్తున్నావ్ బాబూ?

కుమా : మదరాసునుంచేనండి. మూర్తిగారు ట్రీట్‌మెంట్ ఇస్తానన్నారు. పది సంవత్సరాలనుంచి దగ్గుతో అవస్థ పడుతున్నానండి. మూర్తిగారిచేత పరీక్ష చేయించుకుందామని వచ్చాను. అబ్బ! ఇది పాడు జబ్బు కదండి. చంపనూ చంపదు, బ్రతకనూ బ్రతకనివ్వదు.

[దగ్గుతాడు]

జనా : అలాగా బాబూ! మూర్తి అర్జెంటు కేసుమీద ఆస్పత్రి కెళ్ళాడు. ఇప్పుడే వస్తాడు. ఇంతకూ కాళ్ళు కడుక్కుని మంచితీర్థం పుచ్చుకున్నావా?

కుమా : లేదండీ.

జనా : అయ్యోరామ! శ్యామలా! అబ్బాయి స్నేహితుడు ఎవరో వచ్చాడు. కొంచెం కాళ్ళకు నీళ్ళుపట్రామ్మా.

[శ్యామల నీళ్ళుతెచ్చి తలవంచుకుని
కుమార్ దగ్గర వుంచుతుంది]

కుమా : నమస్కారం శ్యామలాదేవిగారూ!

[శ్యామల చరచరా లోనికి పోతుంది]

కుమా : మీ కోడలుగారు కదండీ?

జనా : అవును బాబూ!

కుమా : చాలా ఉత్తమురాలండి. మదరాసులో వివాహ సందర్భంలో డాక్టరుగారు పరిచయం చేశారు. ఒక్కొక్కరి సుకృతం సుమండి. మీరెంతో సుకృతం చేసుకున్నారు కాబట్టే ఇలాంటి ఉత్తమురాలు కోడలుగా....

జనా : మా శ్యామలమ్మ మహాలక్ష్మి.

కుమా : కానీ, చూశారూ మామయ్యగారూ....

జనా : ఏమిటి అ కానీ....

కుమా : ఏంలేదు. నేనంటే బాగుండదనుకోండి.

జనా : అను బాబూ! నేను వట్టి నిర్మోహమాటం మనిషిని.

కుమా: యీ రోజుల్లో చూశారూ—పెద్దవారు—తమకు తెలియని విషయం కాదు—మంచికి చెడుకి విమర్శనలేకుండా పోయింది. నేను నా జీవి

తంలో ఇప్పటికి ఒక లక్ష కుటుంబాలు చూచి వుంటాను. ప్రతి కుటుంబంలో ఏదో ఒక గొడవే. ఒక్క భార్యకూడా భర్తతో....

జనా : నీవు చెబుతున్నది....

కుమా: ప్రపంచమంతా ఇలావున్నా, మన మూర్తిగారికి ఇలాంటి ఉత్తము రాలు భార్యగా దొరకటం విశేషంకదండీ?

జనా : నిజంబాబూ....నిజం చెప్పావ్.

కుమా: వస్తుంటే దారిపొడుగునా మస్తాను సాయిబు తమ కుటుంబము సంగతే చెప్పాడండి. ఈ చుట్టుపట్ల ఇంత శ్రీమంతులు, ఇంత ధర్మపరులూ—అలాంటి కుటుంబానికి కోడలు కావడం....

జనా : మా శ్యామల భాగ్యమంటావు.

[మూర్తి వస్తాడు]

మూర్తి: అబ్బ! పాడుకేసు నాన్నా! ఆ అమ్మాయి తల చితికిపోయింది పాపం! అదంతా సరిచేసి కట్టు కట్టేసరికి ఈవేళయింది. నాన్నా! మీరు భోంచేశారా?

జనా : ఉఁహూఁ. ఇంకాచెయ్యలా. మీ స్నేహితుడెవరో మదరాసునుంచి వస్తే మాటాడుతూ కూచున్నా.

మూర్తి: నా స్నేహితుడా? ఎవరు?

కుమా : నేనేనండి.

మూర్తి: మీరు....

కుమా : గుర్తించలేదా?

మూర్తి: మీరు....

కుమా : [టేబుల్ మీదనుంచి ఒక విగ్రహంతీసి] ఇది జ్ఞాపకము వుందా?

మూర్తి: ఓఁ మీరా! ఇది మీరు ప్రజెంటు చేసిందే.

కుమా : జ్ఞాపకం వచ్చానా?

మూర్తి: అవును, మీ పేరు....రాం....

కుమా : రాంకుమార్. మీ వివాహమహోత్సవాన్ని సందర్శించే మహా భాగ్యము కలిగిన ప్రత్యేక అతిథుల్లో నేను ఒకణ్ని. ఒక చిన్న ఏకాంక నాటికలో....

మూర్తి: అవును. మీరు నటించారుకూడా.

కుమా : yes. మీరు నాకు ఒక బహుమతికూడా ఇచ్చారు. తరువాత మిమ్మల్ని ప్రైవేటుగా కలుసుకుని ఒకచిన్న మనవిచేసుకున్నాను.

మూర్తి: మీకు ఏదో క్రానిక్ డిసీజ్ వుందన్నారుకదూ!

కుమా : అవును. టి. బి. అని అనుమానంగావుంది. మిమ్మల్ని టెస్టుచెయ్యమని అడిగాను. మీరు మీ ఊరికివస్తే తీరిగ్గా పరీక్షచేసి ట్రీట్‌మెంట్ ఇస్తానని వాగ్దానంచేశారు. జ్ఞాపకంవుందా డాక్టర్?

మూర్తి: Yes. Sure. తప్పకుండా. మనం కలుసుకొని ఇన్నాళ్ళయినా జ్ఞాపకం వున్నందుకు Thanks. ఈ గొడవలో అడగడం మరచాను. మీరుకూడా భోజనం చేయకుండా కూచున్నారేం.

కుమా : తొందరేముందిలెండి. వీరంతా నాకు క్రొత్త.

మూర్తి: వీరు మా నాన్నగారు.

కుమా: తెలుసు. పరిచయమయింది. వారూ నేనే మాట్లాడుతూ కూర్చు న్నాము.

మూర్తి: మరి మీరు భోజనానికి లేవండి.

కుమా: మీరు స్నానం కానీయండి డాక్టర్.

మూర్తి: Well. ఆలస్యానికి క్షమించాలి.

జనా : నేను వెడుతున్నాను బాబూ. పెద్దవాణ్ని ముందే భోజనం ముగిస్తా.

[లోనికి వెడతాడు]

మూర్తి: ఈలోగా–పోనీ కొంచెం ఓవల్ టైన్ పుచ్చుకోండి. శ్యామలా!

[చిన్న వస్తుంది]

చిన్న : ఏమిటన్నయ్యా?

మూర్తి: వదిన్ని ఓవల్ టైన్ తెమ్మను.

[చిన్న లోనికి పోతుంది.]

కుమా: సిగరెట్ కాలుస్తారా? (ఇస్తాడు)

మూర్తి: Thank You.

[శ్యామల ఓవల్ టైన్ తెస్తుంది]

నా మిసెస్ మిష్టర్ కుమార్, శ్యామల. శ్యామలా! వీరు మద్రాసులో మన వివాహానికి వచ్చారు. వీరికి ట్రీట్ మెంట్ యిస్తానని మనవూరు రమ్మన్నాను. వీరిపేరు కుమార్.

కుమా: నమస్కారం శ్యామలాదేవిగారూ!

[శ్యామల చేతులు వణికి, ట్రే పడిపోతుంది]

మూర్తి: శ్యామలా!

శ్యామ: మళ్ళీ కలుసుకొస్తాను. (లోనికి పోతుంది)

మూర్తి: వట్టి భయంమనిషి.

కుమా: కొత్త.

మూర్తి: ఇంకా నలుగురిలో తిరగటం అలవాటుకాలా.

[శ్యామల తిరిగివస్తుంది ఓవల్టైన్ కప్పులతో]

(ఓవల్టైన్ తీసుకుంటూ) మా శ్యామల గొప్పనర్స్. మిష్టర్ కుమార్. కాపురానికి వచ్చిన రెండు నెలల్లో నర్సింగంతా నేర్చుకుంది.

కుమా: మీ నర్సింగ్‌హోమ్‌లో హెడ్‌నర్సుగా పోస్ట్ చెయ్యాల్సింది. భర్త డాక్టర్, భార్య నర్స్, బ్యూటీఫుల్‌గా వుంటుంది శ్యామలాదేవిగారూ.

[శ్యామల లోనికి పోతుంది]

మూర్తి: మా నాన్నగారిని ఎలా నర్స్ చేస్తుందనుకున్నారు! ఆయనకు ఉబ్బసం. ఒకమాటు మూడు రాత్రిళ్ళూ పగళ్ళూ ఆయనకోసం నిద్రకాచింది.

కుమా: రాత్రిళ్ళు మేలుకోవడం కొందరికి చాలా చులకన డాక్టర్.

మూర్తి: శ్యామలా!

[శ్యామల వస్తుంది]

కుమా: ఈ వూళ్లో అద్దెకు ఇళ్ళు దొరకవా డాక్టర్?

మూర్తి: ఎందుకండీ? మా యింట్లో మీకు చోటులేకనా? చూడు శ్యామలా! వీరు మన ఇంట్లోనే వుండి ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. మన Out house శుభ్రంగా కడిగించి బెడ్ వేయించు. అక్కడ గాలీ వెల్తురూ బాగా వస్తాయి. శ్యామలా! నేను వీరిని రేపు పరీక్ష చేసి ఛార్టు ఇస్తాను. నీవు దాని ప్రకారం మందు, ఆహారం ఇవ్వు. నీకు తోడు కావాలిస్తే ఒక నర్సును పంపుతాను. I am sorry మిష్టర్ కుమార్! మీరు స్నానానికి లేవండి.

కుమా: మీరు కానీయండి డాక్టర్.

మూర్తి: One minute, శ్యామలా! నరసన్నను నీళ్ళు లోడమను. (వెడుతూ ఆగి) శ్యామలా! ఆ మెడిసిన్ చెస్ట్ తీసుకురా.

[శ్యామల మెడిసిన్ చెస్టు తీసుకొని వెడుతూవుంటుంది]

కుమా: (దగ్గుతాడు)

[శ్యామల వెనుదిరిగి చూస్తుంది)

కుమా: చిట్టీ! (పిలుస్తాడు)

శ్యామ: చిన్నా! (ఫిట్‌లో పడిపోతుంది)

(చిన్న, మూర్తి, జనార్ధనరావు, నరసన్నా పరుగెత్తుతూ వస్తారు)

చిన్న : వదినా!
మూర్తి: శ్యామలా!
జనా : అమ్మాయ్!
నర : అమ్మగారూ!

(ఒక్కసారిగా)

కుమా: (మెల్లగా సిగరెట్టు కాల్చుకుంటూ) పాపం! చాలా బలహీనురాలులా ఉంది డాక్టర్. టానిక్ ఇప్పించలేకపోయారా?

[తెర]

రెండవ రంగం

[దృశ్యం అదే. మూర్తి కుమార్‌కు ఇంజక్షన్ ఇస్తూవుంటాడు.]

కుమా: ఎక్సరే పరీక్షలో ఏం తేలినట్టు డాక్టర్ ?

మూర్తి: టి. బి. అని నిశ్చయంగా చెప్పలేను. అయినా రెండు నెలలు చూడాలి.

కుమా : చాలా దూరం గడువు పెట్టారే.

మూర్తి: మీకిక్కడ ఇబ్బందిగా ఉందా?

కుమా : No, no. అదేమిటండీ?

మూర్తి: కుమార్‌గారూ! మీరు మద్రాసు ఆర్టు స్కూలులోకదూ చదువుకున్నా నన్నారు?

కుమా : అవునండి. నాకు కళన్నా, ఫొటోగ్రఫీ అన్నా చాలా యిష్టం.

[జనార్ధనరావు వస్తాడు]

మూర్తి: ఎక్కడికి నాన్నా ?

జనా : దిగుడుబావికి. దివ్యంగా స్నానంచేసి....

మూర్తి: చన్నీళ్ళస్నానం పనికిరాదు.

జనా : ఏం ఫరవాలేదు. ఘటం గట్టిది.

కుమా : తువ్వాలు మరచిపోయారు.

జనా : అయ్యోరామ! ముదిలో మతిపోతోంది. అమ్మాయ్ శ్యామలా! నా కొల్లాయిగుడ్డ.

[చిన్న తెచ్చియిచ్చి వెడుతుంది]

ఇవాళ స్నానంచేసి గంటన్నర జపం చేయాలి.

[వెడతాడు]

కుమా : మీ నాన్నగారు చాలా మంచివారు.

మూర్తి: ఎన్ని జన్మల్లోనైనా వారి ఋణము తీర్చుకోలేను. మా చిన్నను కని మా అమ్మ చనిపోయింది. నాన్నగారే కన్నతల్లిలా మమ్మల్ని సాకారు. తరువాత నేను పట్నంలో చదువులకు వెళ్లాను. అంకంత యీ కొంపలో నాన్నా, చిన్న ఇద్దరే. తర్వాత శ్యామల వచ్చింది.

కుమా: శ్యామలగారంటే జ్ఞాపకంవచ్చింది. డాక్టర్! పాపం వారి ఆరోగ్యం సరిగా ఉన్నట్టులేదు. ఏదైనా టానిక్ ఇప్పించకపోయారా!

మూర్తి: శ్యామలకు ఫిట్సురావడం ఇదే మొదటిసారి.

కుమా : ఫిట్సుకు కారణము ఏమైవుంటుందంటారు?

మూర్తి: నరాల్లో బలహీనత కావచ్చు.

కుమా : మనస్సులో బలహీనతకూడా కావచ్చు.

మూర్తి: శ్యామలకు మానసికబాధ ఉండవలసిన అవసరం నాకు కనిపించ లేదు.

కుమా : ఎవరి మనస్సులో ఏ దయ్యాలు దాక్కొని ఉన్నాయో మనకు తెలుస్తుందా డాక్టర్?

మూర్తి: అది వేరే సైన్సు.

కుమా : వట్టి ఫిజిషియన్ అండ్ సర్జన్. అంతేకదూ?

మూర్తి: సైకాలజీకూడా కొంతవరకు చదివాను. మా శ్యామలకు యింత వరకు మనోబాధ వున్నట్టు నేను గమనించలా, ఒక్క క్షణంకూడా డల్‌గా ఉండేదికాదు.

[చిన్న కాఫీ తెస్తుంది]

మూర్తి: చిన్నా! మీ వదిన్ను బత్తాయిరసం తెమ్మను.

[చిన్న వెడుతుంది]

కుమా : **Dont' worry!**

మూర్తి: కాదు. మీరు మంచి ఆహారం తీసుకోవాలి,

[శ్యామల మందు, బత్తాయిరసం తెస్తుంది]

మూర్తి: శ్యామలా! కుమార్‌గారికి ఆ మిక్చర్ ఇవ్వు. నేను ఇప్పుడే ఒక పేషెంటును చూచి వస్తాను.

[వెడతాడు]

[శ్యామల మందు, బత్తాయిరసం టేబుల్‌మీద వుంచుతుంది]

కుమా : చిట్టీ!

[శ్యామల లోనికి పోతుంది]

(కుమార్ మందు పారబోసి బత్తాయిరసం త్రాగి,సిగరెట్టు వెలిగిస్తాడు)

(శ్యామల తిరిగివస్తుంది)

శ్యామ : నీ మంచికే చెపుతున్నాను, వెళ్ళు.

కుమా : వెళ్ళడానికి ఇంతదూరం రావాలా?

శ్యామ : కుమార్! ఇది నీ మంచికే, వెళ్ళు.

కుమా : చిట్టీ! ఇది నీ మంచికే, నాతోరా.

శ్యామ : నీ నాటకాలు చాలించు.

కుమా : చిట్టీ! నామాట విను.

శ్యామ : నీ నాటకాలు చాలించు.

కుమా : బండి సిద్ధంచేశాను. రాత్రికి పిలుస్తా. ప్రయాణం కావాలి.

శ్యామ : ఆ ప్రయాణం నీవే చెయ్యొచ్చు.

కుమా : అయితే ఆ అంతుకూడా నేనే చూడొచ్చు.

శ్యామ : నీ తాతలు దిగిరావాలి.

కుమా : తాతలదాకా ఎందుకు? నేనే దిగొచ్చాను. చిట్టీ నామాట విను. వినవూ?

[అంటూ చేయి పట్టుకోబోతాడు]

శ్యామ : ఆగు. జాగ్రత్త! (వెడుతుంది)

కుమా : ఓ! నీడపట్టున నిమ్మపండులా నాలుగురోజు లుండేసరికి మాటలు ముదిరిపోయాయే. అమ్మ చిట్టీ!

కుమా : నరసన్నా!

[నరసన్న వస్తాడు]

నా బ్యాగ్ పట్రా.

[నరసన్న వెడతాడు, చిన్నవస్తుంది]

చిన్న : ఏం వెడుతున్నారా?

కుమా : నేను ఉండటం నీకు ఇష్టం లేనట్టుందే. చిన్నా! ఇలారా.

చిన్న : ఎందుకు?

కుమా : ఆ సోఫామీద కూచో-చెబుతా. నీకు ఒక మంచి ప్రజెంటు ఇస్తా.

[సంచిలోంచి ఒక కెమేరా-ఆల్బం తీస్తాడు]

చిన్నమ్మా! స్టడీ! ఇలా తిరుగు. ఇలా, కొంచెం! అఁ Yes. One, two, three. Thank you.

చిన్న : ఏది ప్రజెంటు?

కుమా : రేపిస్తా వెళ్ళు. (చిన్న వెడుతుంది)

[మూర్తి వస్తాడు]

డాక్టర్! అలాగే. ఊఁ. అలాగే నిల్చోండి. కదలకండి.

Thank you (కెమేరా సంచిలో పెట్టి)

డాక్టర్! మీ గ్రామంలో చూడదగిన ప్రదేశాలు చాలా వున్నాయనుకుంటాను.

[మూర్తి బయటకు చూస్తూ]

మూర్తి: ఇలారండి. అటు చూడండి. ఆ కొండ చూచారుకదూ! ఆ బంగళా చూశారా? ఆ చుట్టూ తోట కనిపిస్తోందా?

కుమా : ఎవరిది డాక్టర్ ఆ బంగళా?

మూర్తి: మా నాన్నగారు కట్టించారు. ఎప్పుడైనా విశ్రాంతికోసం నేను కుటుంబంతో సహా అక్కడికి వెడతాను.

కుమా : **Nice Location.**

మూర్తి: ఆ కొండప్రక్కనే నది. అక్కడికి వెళ్ళాలంటే ఆ నదిదాటాలి. నదిని దాటిస్తూ పడవవాళ్ళు పాడేపాటలు ఎంత హాయిగా వుంటాయనుకున్నారు!

కుమా : డాక్టర్! మీరు హనీమూన్‌కు కాశ్మీర్ వెళ్ళారా?

మూర్తి: లేదు. ఏవో పనులుండటంవల్ల వెళ్ళలేకపోయినాను. అప్పుడు నర్శింగ్‌హోమ్ కట్టిస్తున్నాను. ఈ కొండమీద బంగళాకే వెళ్ళాను.

కుమా : డాక్టర్! జీవితంలో ఒక్కమారైనా కాశ్మీర్ చూచితీరాలి.

మూర్తి: మీరు వెళ్ళారా?

కుమా : ప్రతిసంవత్సరం వేసవిలో కాశ్మీర్ వెడతాను డాక్టర్! కాశ్మీర్! ఓహ్! ఎలా వుంటుందనుకున్నారు: కాశ్మీర్‌లో ప్రతికోణంలో ఒక అద్భుతదృశ్యం కనుపిస్తుంది. ఒక్క కాశ్మీరేకాదు. మనదేశంలో నేను చాలా ప్రదేశాలు చూశాను. అజంతా, ఎల్లోరా, శ్రీనగర్ డార్జిలింగ్, పంపా అడవులు, దక్షిణాది దేవాలయాలు, కేప్ కామరిన్, మధురాటెంపుల్ - పెద్ద ఆల్బం తయారుచేశాను డాక్టర్

చూడండి. (అల్బం ఇస్తాడు. అల్బంలో చూపుతూ) శ్రీనగరు లోయ.

మూర్తి: Fine.

కుమా : ఇది శివసముద్ర జలపాతం.

మూర్తి: ఓ!

కుమా : ఇది అజంతా గుహల్లో బుద్ధప్రతిమ....డాక్టర్. మీరు అల్బం చూస్తూవుండండి. నే నిప్పుడే చల్లగాలికి అలా తోటలోకి వెళ్ళొస్తాను. (కుమార్ బయటికి పోతాడు)

[మూర్తి అల్బం తిరగేస్తుంటాడు. అతని నుదుటినిండా చెమట పడుతుంది. కళ్ళు ఎర్రబడిపోతాయి. అల్బం గబగబా తిరగేస్తూ ఒక్కసారిగా లేచి బిగ్గరగా "శ్యామలా" అని పిలుస్తాడు. శ్యామల అంతకు మునుపేవచ్చి సోఫావెనుక నిలబడి అల్బం చూసి స్తబ్ధుగా నిలబడి వుంటుంది.]

మూర్తి: ఈ ఫొటోలు ఎవరివి?

శ్యామ : నావే.

మూర్తి: ఇలాంటి ఫొటోలు తీయించుకోడానికి సిగ్గులేదూ?

శ్యామ : అప్పుడు అలాంటి అవసరం వచ్చింది.

మూర్తి: Shut up.

శ్యామ : డాక్టర్!

మూర్తి: నన్నెంత మోసంచేశావ్?

శ్యామ : మిమ్మల్ని మీరే మోసంచేసుకున్నారు.

మూర్తి: ఏమన్నావ్?

శ్యామ : మిమ్మల్ని మీరే మోసం చేసుకున్నారు డాక్టర్!

మూర్తి: శ్యామలా!

శ్యామ : ఆరోజు రాత్రి జ్ఞాపకంలేదా డాక్టర్?

మూర్తి: ఏరోజు? ఏ రాత్రి?

శ్యామ : ఆరునెలల క్రితం—ఒకనాటి అర్ధరాత్రి — మిన్నూమన్నూ ఏకం చేస్తున్న వర్షపుహోరులో—ఇరవైమంది రౌడీలు తరుముతూంటే భయంతో పరుగెత్తుతూవచ్చి మీ గదితలుపు తట్టాను. జ్ఞాపకం లేదా డాక్టర్?

మూర్తి: అవును—అవును, అవును.

శ్యామ : మీ కాళ్ళుపట్టుకుని ఈ ఒకరాత్రికి శరణ్యంఇవ్వండని ప్రాధేయపడితే ఆ రాత్రి మీరు నాకు ఆశ్రయం ఇచ్చారు. జ్ఞాపకంలేదా డాక్టర్?

మూర్తి: కావచ్చు.

శ్యామ : తెల్లవారితేచి నా దోవన నేను వెడదామని మీదగ్గర సెలవు తీసుకుంటున్నప్పుడు మీ రేమన్నారో జ్ఞాపకంవుందా డాక్టర్?

మూర్తి: ఏమన్నాను?

శ్యామ : మీరు "ప్రమాదస్థితిలో ఉన్నట్టున్నారు. మీకు అభ్యంతరం లేకపోతే మరి రెండు రోజులు వుండిపోవ"చ్చన్నారు. అనలేదా డాక్టర్?

మూర్తి: అవును. అన్నాను. అంటే....

శ్యామ : తరువాత ఒకనాటి సాయంకాలం ఏం జరిగిందో జ్ఞాపకం ఉందా డాక్టర్?

మూర్తి: శ్యామలా! ఆ విషయం చెప్పకు. ఆ భీకర క్షణాన్ని నాకు జ్ఞాపకం చెయ్యకు. గడచిన జ్ఞాపకాలతో నా మనస్సు క్షోభపెట్టకు. శ్యామలా! ఆ విషయం చెప్పకు.

శ్యామ : చెప్పనివ్వండి డాక్టర్! మన పాపాలు ముఖాముఖిగా మాట్లాడుకోవడం మంచిది. ఆ సాయంత్రం మీరు ఆస్పత్రినుంచివచ్చేసరికి బాగా ప్రొద్దుకూకింది. నేను ఒంటరిగా గదిలో కూచుని ఉన్నాను. మీరు లోపలికి రాగానే లైటు వెలిగించి నావంక చూశారు. నేను లేవబోయాను. 'కూచో' అన్నారు. మీరు తీక్షణంగా నావంక చూస్తూ నా దగ్గరికి వస్తున్నారు. భూమి నా క్రింద పగుళ్ళిచ్చి నన్ను ఏ అగాధంలోకో లాక్కొని పోతున్నట్టు తోచింది. మీరు నన్ను సమీపించి నా ముఖాన్ని గట్టిగా మీ చేతుల్లోకి తీసుకుని....

మూర్తి: శ్యామలా! శ్యామలా! ఆ విషయంచెప్పకు. ఆ భయంకరక్షణాన్ని జ్ఞాపకం చేయకు.

శ్యామ : నేను ఒకమూల ఏడుస్తూ నిల్చున్నాను. మీరు నా భుజాలుపట్టుకుని 'శ్యామలా! క్షమించు. నీవు మరో విధంగా అనుకోకపోతే నిన్ను ఒకవిషయం అడుగుతాను' అన్నారు. అనలేదా డాక్టర్?

మూర్తి: అన్నాను. అన్నాను శ్యామలా!

శ్యామ : నా కళ్ళల్లో కళ్ళుంచి చూస్తూ 'సృష్టిలో అందంఅంతా ఈకళ్ళల్లో గూడుకట్టుకుని వుంది. ఈ అందాన్ని నేను భార్యగా పొందే

భాగ్యం నాకు ప్రసాదించవూ?' అన్నారు. జ్ఞాపకంలేదా డాక్టర్? అప్పుడు నాకు ఎలా అనిపించిందనుకున్నారు? ఎలా అనిపించిందనుకున్నారు! అడవిలో పోతున్న స్త్రీకి అండదొరికితే కాలదన్నుకుంటుందా డాక్టర్?

కాని, నా చరిత్ర నాకు జ్ఞాపకం వచ్చింది. నా అంతరాత్మ నన్ను వెనక్కులాగింది. నా జీవితంలో వ్యాపించిన నీడలన్నీ ఒక్కమాటుగా నా మనసులో ముసిరాయి. నా చరిత్ర మలినమైందనీ, నాజీవితంలో విధి విషాదాన్నికురిపించిందనీ, నాకు అర్ధాంగినయ్యే అర్హత ఏనాడో తొలగిపోయిందనీ .మీతో చెప్పబోయాను. కాని మీరు నానోటికి చెయ్యి అడ్డంవుంచి ఏమన్నారో జ్ఞాపకం వుందా డాక్టర్ ?

మూర్తి: ఏమన్నాను?

శ్యామ : 'నాకు కావలసింది నీవు — నీ చరిత్రకాదు' అన్నారు. అనలేదా డాక్టర్?

మూర్తి: (Repeats) నాకు కావలసింది నీవు, నీ చరిత్ర కాదు.

శ్యామ : అనలేదా డాక్టర్?

మూర్తి: అన్నాను—అవును.

శ్యామ : తరువాత ఒకవారం మీ గదిలో వున్నాను. ఆ వారంరోజులూ మీరు నన్ను భార్యలా చూశారు. "శ్యామలా! కాఫీ, శ్యామలా! తువాలు శ్యామలా! నీళ్ళుతోడావా?" అనేవారు. అన్ని విషయాలు నాతో చెప్పేవారు. నా లాలనా, పాలనా మీకు అవసరము అయి

పోయింది. యిలా ఒకవారం ఒక క్షణంలా గడిచింది. ఆ వారం రోజులు నాకు మరేదో లోకంలో వున్నట్లనిపించింది. నా గత జీవితాన్నంతా విస్మరించాను నేనూ, మీరూ ఈ లోకానికి దూర మైన ఏదో దివ్యలోకంలో విహరిస్తున్నట్లుగా తోచింది.ఒకరోజున మీరు హడావుడిగా పరుగెత్తుకొంటూ వచ్చి "శ్యామలా! మనము తక్షణము ఒక పెళ్ళికి వెళ్ళాలి" అంటూ నాకొక ఆహ్వానపత్రం యిచ్చారు. అందులో నా పేరు, మీ పేరు వున్నాయి. నేను ఆశ్చర్యపోయాను. అది సుఖమో, దుఃఖమో యిప్పటికీనేను చెప్ప లేను. కాని నా అంతరాత్మ మేలుకుంది. నా మలిన చరిత్ర మీకు వినిపించబోయాను. మీరు మళ్ళీనాకు అడ్డంవచ్చారు. "నాకు కావలసింది నీవు. నీ చరిత్రకాదు" అన్నారు. అనలేదా డాక్టర్?

మూర్తి: అన్నాను. అన్నాను శ్యామలా!

శ్యామ : యిలా మన వివాహం జరిగింది. యిలా నేను మీకు భార్యనైనాను. యిలా మీరు నన్ను బంధించారు. డాక్టర్! యిప్పుడైనా నా చరిత్ర చెప్పనివ్వండి. యిప్పుడైనా మన జీవితంలో తుఫాను తెచ్చిన ఆ రహస్యక్షణాన్ని వాయిదా వెయ్యకండి.

మూర్తి: శ్యామలా! ఇక చెప్పకు.

శ్యామ : చెప్పనివ్వండి డాక్టర్! నిజాన్ని నిప్పునూ దాచడం మంచిది కాదు.

నేనూ మంచి కుటుంబంలోనే పుట్టాను. తల్లీ! తండ్రీ, అక్కలూ చెల్లెళ్ళూ అంతా వున్నారు. ఎవరి బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతు

న్నారు. నేనొక్కదాన్నే ఇలాఅయ్యాను. నా పదహారోయేట_నేను దేవకన్యలా ఉండేదాన్ని. మా మేడమీదగదిలో ఒకతను అద్దెకుండేవాడు. అతనూ నేను ప్రేమించుకున్నాం. అతనే రాంకుమార్. అతను ఎన్నో కబుర్లుచెప్పి నన్ను మదరాసు తీసుకొచ్చాడు. నా సొమ్ములతో సహా నేను వచ్చేశాను. మైలాపూరులో ఒక చిన్న యిల్లు అద్దెకు తీసుకొని ఉన్నాం. వచ్చిన కొత్తలో రెండు నెలలు హాయిగానే గడిచాయి. కాని తరువాత ప్రారంభించింది తుఫాను. మా విలాసాలకూ వినోదాలకూ సొమ్మంతా కరిగిపోయింది. సొమ్ముతోపాటు మా ఇద్దరి మనసుల్లో ప్రేమ కూడా కరిగిపోయింది డాక్టర్. అతను నన్ను అదోవిధంగా చూచేవాడు. ఒక రోజు నాకూఅతనికీ పెద్ద పేచీవచ్చింది. నన్నుచావగొట్టి' ఇక నీచావు నీవుచావు' అని తనబట్టలు సర్దుకుని వెళ్ళిపోయాడు. పాపం! అతనూ నన్ను ప్రేమించాడు. కాని వట్టి పిరికి! అడవిలో వదలి తన దోవన తను పోయాడు. యిక ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్ళను! ఆశ్రయంలేకపోయింది. ఇల్లు ఖాళీచేశాను. వీధులు పట్టాను. ఎన్నో పనులకోసం యత్నించి చూశాను. ఎక్కడా అవమానం తప్పలేదు. ఆరు పూటలు అన్నంలేక వీధులవెంట పిచ్చిదానిలా నడిచిపోతూ ఒక గుమ్మంముందు పడిపోయాను. ఆ ఇంట్లో ముసలిది నాకు ఆశ్రయం యిచ్చింది. అది వేశ్య. ఆ యిల్లు భోగంకొంప. తరువాత నా జీవితాన్ని ఒక తివాచీలా పరచాను. ఈ తివాచీమీద ఎందరు నడిచివెళ్ళారో నాకే జ్ఞాపకంలేదు డాక్టర్! నాకే జ్ఞాపకంలేదు. ఆ హింసలు పడలేకపోయాను. ఆ యింట్లోనుంచి ఒకరాత్రి తప్పించుకుని వస్తున్నాను. రౌడీలు నన్ను

వెంబడించారు. నన్ను వెంటాడారు. ఆ రాత్రే మీరు నాకాశ్రయం యిచ్చారు. ఆ రాత్రే నా బ్రతుకు మరోదోవకు మారింది. ఇప్పుడు మళ్ళీ మారుతోంది.

కళ్ళుకానని యౌవనంలో కుమార్‌ని నమ్మి చెడిన నాది తప్పా? దరిద్రాన్ని ఎదుర్కొనలేక నన్నడవిలో వదలి తప్పుకున్న కుమార్‌ది తప్పా? కాయకష్టం చేస్తానన్నా కడుపుకోసం పట్టెడు మెతుకులు పెట్టనన్న లోకంది తప్పా?

నా కాశ్రయంయిచ్చి, నన్ను ప్రేమించి, నా చరిత్ర చెప్పనివ్వక నన్ను భార్యగా స్వీకరించిన మీది తప్పా?

ఎవరిది డాక్టర్ తప్పు?....మాట్లాడరేం?

[నిశ్శబ్దం. మూర్తి లోనికిపోతూ ద్వారందగ్గర ఆగుతాడు]

నాకు తెలుసు ఈ ముసురు ముంచుకొస్తుందని. మీ జీవితంలో ప్రవేశించి అనవసరంగా కలవరం కల్గించాను. క్షమించండి. మీ అంతస్తు పెద్దది. మీ ఇంట్లో దాసిమనిషిగానైనా ఉండే అర్హత, అధికారం నాకు లేవు.

ఇన్నాళ్ళు ఉన్నానే కాని ముండ్ల కంపమీద ఉన్నట్లున్నాను. (మూర్తి తల్లిపటం చూపుతూ) ఎన్నడూ కళ్ళెత్తి ఈ పటాన్ని సూటిగా చూడగలిగేదాన్ని కాదు డాక్టర్! ఇక వెడతాను. సెలవు డాక్టర్! ఒక మనవి. మీరు మళ్ళీ వివాహం చేసుకోండి. ఈ మాటు తొందరపడకండి. కుటుంబం, కులం. గోత్రం, చరిత్ర

జాగ్రత్తగా చూసుకోండి. మరి సెలవు. నమస్కారము........ నరసన్నా!

నర : అమ్మా! (వస్తాడు)

శ్యామ: నా సంచీ, చీరలూ పట్రా,

నర : అమ్మా!

శ్యామ: పట్రా నరసన్నా.

[నరసన్న వెడతాడు]

శ్యామ: వస్తాను నన్ను మరచిపోండి, మీరు సుఖంగా వుండండి. నాకు అంతేచాలు.

[శ్యామల వెడుతూంటుంది]

మూర్తి: (శ్యామలకు అడ్డుపడి) శ్యామలా! (ఏడుస్తూ పట్టుకుంటాడు)

శ్యామ: ఏమిటండీ! ఏమిటండి! అలా పసిబిడ్డలా........

మూర్తి: శ్యామలా! నీవు లేనిదే నేను బ్రతుకలేను శ్యామలా! వెళ్ళనను. వెళ్ళనను, వెళ్ళనను శ్యామలా!

శ్యామ: డాక్టర్!

మూర్తి: వెళ్ళనను శ్యామలా! ఈ ప్రపంచమంతా నన్ను నిందించనీ, తరిమికొట్టనీ, వెలెయ్యనీ. ఈ ప్రపంచం కొసకైనా నీతోనే వస్తాను శ్యామలా! నీవు పడుపుకత్తెవే కావచ్చు. ఏమైనాకావచ్చు. నాకు నీవేకావాలి. ఆరోజు నిన్ను ఎలా స్వీకరించానో ఈక్షణంలో కూడా అలాగే స్వీకరిస్తున్నాను—నరసన్నా!

నర : (వస్తూ) అయ్యా!

మూర్తి: కుమార్‌ని పిలు.

నర : అయ్యా (వెడతాడు) [కుమార్ తనంత తానే వస్తాడు]

కుమా: ఇక్కడే ఉన్నాను డాక్టర్! ఎందుకో పిల్చారట? ఏం అలా వున్నారు? ఏదైనా సీరియస్ ఆపరేషన్‌చేసి వచ్చారా?

మూర్తి: నరసన్నా!

నర : (వచ్చి) అయ్యా!

మూర్తి: వీరిపెట్టె, బెడ్డింగుపట్రా.

కుమా: ఏమిటి డాక్టర్! నాకేం అర్థం కావడంలా. ఏమిటండీ శ్యామలా దేవిగారూ?

[నరసన్న సామాను తెస్తాడు]

మూర్తి: నరసన్నా! అవి కార్లో పెట్టు. మన డ్రైవరుతో చెప్పి వీరినిస్టేషన్ దగ్గర వదలిపెట్టి రమ్మను.

కుమా: ఏమిటి డాక్టర్ మీరు పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు. నాతో సూటిగా చెప్పండి.

మూర్తి: ఇంతకాలం పొరపాటుగానే అర్థంచేసుకున్నాను. ఇకముందు సరిగా అర్థంచేసుకొంటాను. మీరు వెళ్ళొచ్చు,

కుమా: You are mistaken Doctor!

మూర్తి: Shut up, Get out.

కుమా: All right (అంటూ గుమ్మంవరకు వెళ్ళి, తిరిగి) డాక్టర్!

మూర్తి: ఏమిటి?

కుమా: ఏంలేదు. గుడ్ బై. మళ్ళీ కలుద్దాం. నమస్కారం శ్యామలాదేవి గారూ! (వెడతాడు)

[తెర]

మూడవ రంగం

[శ్యామల ప్రవేశించి మూర్తి తల్లి ఫోటోకు నమస్కరించి దిగులుగా వచ్చి సోఫాలో కూలబడుతుంది. చిన్న వస్తుంది.]

చిన్న : ఏం వదినా అలా వున్నావ్?

శ్యామ: ఏం లేదమ్మా.

చిన్న : వదినా! అన్నానికి రావూ?

శ్యామ: మీ అన్నయ్యను రానీమ్మా.

చిన్న : వదినా! అన్నయ్య కోప్పడ్డాడా?

శ్యామ: ఊ-లేదమ్మా.

చిన్న : మా ఊళ్ళో నీకు తోచటంలేదా? మళ్ళీ మదరాసు పోదామా?

శ్యామ: మన ఊరికేమమ్మా? చిన్నా నీవువెళ్ళి మంగమ్మచేత అన్నం పెట్టించమని తినమ్మా— వెళ్ళమ్మా. నామాట వినవ్?

(చిన్న మెల్లిగా లోపలికి వెళుతుంది.
నరసన్న బయటనుంచి వస్తాడు)

శ్యామ: నరసన్నా!

నర : అమ్మా!

శ్యామ: అయ్యగారేరీ?

నర : ఆస్పత్రిలో వున్నారమ్మా.

శ్యామ: రమ్మన్నానని చెప్పావా?

నర : చెప్పానమ్మా. "నీవువెళ్ళు తరువాత వస్తా"నన్నారమ్మా. మిమ్మల్ని ఫోంచేయమన్నారమ్మా.

శ్యామ: నరసన్నా!

నర : అమ్మా!

శ్యామ: అయ్యగారికి గ్లాసులో పండ్లరసం ఇచ్చావా?

నర : ఇచ్చానమ్మా.

శ్యామ: తాగారా?

నర : "అక్కడ ఉంచివెళ్ళు. తరువాత తాగుతాను" అన్నారమ్మా.

శ్యామ: అయ్యగారు ఏం చేస్తున్నారు నరసన్నా?

నర : పడకకుర్చీలో కూర్చుని ఏదో ఆలోచించుకుంటున్నారమ్మా. అదోలా ఉన్నారు.

శ్యామ: సరే. నీవువెళ్ళు నరసన్నా,

[నరసన్న పోతుండగా] నరసన్నా!

నర : అమ్మా!

శ్యామ: అహఁ, ఏంలేదు నరసన్నా.

(నరసన్న లోనికిపోతాడు, జనార్ధనరావు విసురుగా వస్తాడు. అతనివెంట నాగయ్య)

జనా : ఎవరోయ్ ఆ మాటలన్నది? తొక్క తీసేస్తాను. ఈ ఊళ్ళో ప్రతికాలనేనా వాడు? ఊరూ పేరూలేని వెధవల్లా నోటికివచ్చినట్లు వాగుతాడు....

నాగ : నాకేం తెలుసుసార్? ఆస్పత్రిలో ఎవరో వార్డు అంటే విన్నాను. ఊరంతా అదేమాట.

జనా : ఏమన్నావ్?

నాగ : ఊరంతా అనుకుంటున్నారట సార్. నాకెందుకు సార్? మనస్సులో వుంచుకోలేక చెప్పాను.

జనా : ఉండు. ఉన్నచోట ఉన్నట్టు నిజం తేల్చేస్తాను. నా సంగతి ఎవరికీ తెలీదు. తలచుకున్నానంటే....బ్రహ్మరుద్రులయ్యేది....

నాగ : ఆ క్లబ్ సెక్రటరీగారింట్లో మకాంపెట్టాడు సార్! ఆ సెక్రటరీ కూడా తోడయ్యాడు. క్లబ్‌లో యిదే గొడవ. లోకం కోడై కూస్తోంది.

జనా : వాడూ చేరాడూ? తిన్నవాళ్ళేరా తిప్పలు తెచ్చేది. రాస్కెల్సు వుండు. ఉన్నచోట నిజం తేల్చేస్తాను. నాదగ్గర దాపరికాలు పనికిరావు. అమ్మాయ్! శ్యామలా! (బిగ్గరగా పిలుస్తాడు)

(శ్యామల వచ్చి నిల్చుంటుంది)

జనా : నిజం చెప్పు.

(మూర్తి వస్తాడు)

మూర్తి: నాన్నా!

జనా : బాబూ!

మూర్తి: అది నాకు సంబంధించిన విషయం.

జనా : నీకేకాదు. నాకూ సంబంధించిన విషయమే. నా కులం, గౌరవం, పరువు, ప్రతిష్ఠ ఏమయ్యాయనుకున్నావురా?

మూర్తి: నాన్నా! తొందరపడకండి. కమృదించుకుంటే కాళ్ళమీద పడుతుంది. శ్యామలా! నాన్నగారిని మేడమీదికి తీసుకువెళ్ళు.

[శ్యామల జనార్ధనరావు చేయిపట్టుకుని పైకి తీసుకునిపోతుంది. బాధతో వెళతాడు]

మూర్తి: నాన్నగారితో ఎందుకు చెప్పావ్?

నాగ : ఉండబట్టలేకపోయా సార్.

మూర్తి: జ్ఞానం ఉండక్కర్లా? అసలు విషయం నాతో చెప్పు.

నాగ : ఎవరో వార్డులు గుసగుసలాడుకుంటుంటే విన్నాను సార్. నాదేముంది సార్. తను అండన బ్రతికేవాణ్ణి.

మూర్తి: అసలు ఏం జరిగిందో చెప్పు.

నాగ : అతను ఊళ్ళోనే వున్నాడుసార్. అక్కడ సెక్రటరీ ఇంట్లో మకాంపెట్టాడు. ఇక సాగిస్తున్నాడు సార్ నాటకం. లోకం చూడండిసార్! ఇదిగో తోకంటే అదిగో పులి అంటుంది.

మూర్తి: సరే నీవు వెళ్ళు.

[నాగయ్య వెళతాడు, మూర్తి బాధతో
కూర్చుంటాడు. శ్యామల వస్తుంది]

శ్యామ: ఈ గొడవంతా నా వల్లనేకదండీ_ఎందుకండీ అలా బాధపడతారు? నన్ను వెళ్ళనిస్తే ఏగొడవ వుండేది కాదుగా!

మూర్తి: మళ్ళీ అదేమాటా. నా మనస్సు తెలుసుకోలేవేం శ్యామలా!

శ్యామ: గుండెలమీద కుంపటిపెట్టుకుని_ఎన్నాళ్ళు చెప్పండీ.

మూర్తి: శ్యామలా! నీకే చెప్పేది. నన్ను అనవసరంగా కలతపెట్టకు.

శ్యామ: నాకోసంకాదు. మీకోసమేనండీ చెప్తున్నాను. మిమ్మల్ని మీరు బాధ పెట్టుకుని నన్నెందుకు బాధిస్తారు?

మూర్తి: శ్యామలా! నీకో నమస్కారం చేస్తాను. నీవు ముందు లోపలికి వెళ్ళు. వెళ్ళు, వెళ్ళు శ్యామలా!

[శ్యామల లోనికి పోతుంది]

[క్షణం నిశ్శబ్దం]

చిన్నా! (చిన్న వస్తుంది)

చిన్న : అన్నయ్యా!

మూర్తి: జడవేసుకోలేదేం?

చిన్న : పదినెయ్యాలా.

మూర్తి: పూలు పెట్టుకోలేదేం?

చిన్న : ఇవాళ పూలు కొనలా అన్నయ్యా.

మూర్తి: కొత్త పరికిణీ కట్టుకోలేదేం?

చిన్న : ఏమో అన్నయ్యా (ఏడుస్తూ)

మూర్తి: ఏమిటి ఆ ఏడుపు ముఖం వేసుకుని? ఏం వచ్చిందని? అంతా చచ్చారనుకున్నావా?

చిన్న : అన్నయ్యా!

[శ్యామల వస్తుంది]

శ్యామ : ఎందుకండీ అఘంశుభం ఎరగనిదాన్ని కొప్పడతారు?

మూర్తి: నా చెల్లెల్ని నేను కొప్పడతాను. తిట్టేస్తాను. చంపేస్తాను. నీకేం?

శ్యామ : డాక్టర్!

మూర్తి: చిన్నా ఇలా రామ్మా!

చిన్న : అన్నయ్యా!

మూర్తి: ఇలా రామ్మా! భయంలేదు.

[చిన్న దగ్గరకువస్తుంది. చిన్న గడ్డం పట్టుకుని]

మూర్తి: చిన్నా! ఒకమాట అడుగుతాను చెప్పు.

చిన్న : అడుగు అన్నయ్యా!

మూర్తి: చిన్నా! రేపు నీకు పెళ్ళయి అత్తవారింటికి వెడతావు. అప్పుడు నేను జ్ఞాపకం వుంటానా చిన్నా!

చిన్న : అదేమిటి అన్నయ్యా?

మూర్తి: అయినదానివి నీ వొక్కతెవేనమ్మా. అందుకని అడిగాను.

[శ్యామల లోనికిపోతుంది—చిన్నకూడా పోతుంది]

అంతా వెళ్ళండి. (అరుస్తాడు)

[శ్యామల పాలుతెచ్చి టీపాయి
మీదవుంచి వెళ్ళబోతూంటుంది]

మూర్తి: (రుద్ధస్వరంతో) శ్యామలా!

[శ్యామల దగ్గరకు వస్తుంది]

నీ చేతులిలా ఇవ్వు.

[శ్యామల యిస్తుంది. చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తూ]

వెళ్ళవుకదూ? ఈ తుఫానులో నన్నువదలి వెళ్ళవుకదూ! వెళ్ళవు కదూ!

శ్యామ : అబ్బ! వూరుకోండి. ఎక్కడికీ వెళ్ళను ఊరుకోండి.

[జుట్టు తడుముతుంది]

[వెలుపల పిలుపు]

క్లబ్ సెక్రటరీ: డాక్టర్! డాక్టర్! (శ్యామల లోనికిపోతుంది)

[క్లబ్ సెక్రటరీ రంగారావు వస్తాడు]

రంగా: **Good morning Doctor.**

మూర్తి: **Good morning.** కూర్చోండి. ఏమిటి పనిమీద వచ్చారు?

రంగా: క్లబ్ సెక్రటరీకి పనులేముంటాయి డాక్టర్! ఇలా వెళుతూ చూచి పోదామని వచ్చాను.

మూర్తి: అలాగా.

రంగా: కులాసా డాక్టర్?

మూర్తి: ఏం? కులాసా లేనట్టుగా కనుపిస్తున్నానా?

రంగా: అదికాదు. క్లబ్‌కు రావడం మానేశారేం? మీరురాకపోతే టెన్నిస్ కోర్టు బోసిపోతోంది.

మూర్తి: పోనివ్వండి.

రంగా: డాక్టర్! మొన్న మన క్లబ్ వార్షికోత్సవం జరిగింది చూశారూ?

మూర్తి: అవును.

రంగా: మీరు అధ్యక్షత వహించారు....

మూర్తి: అవును.

రంగా: ఆరోజు డ్రామాలో మధ్యలోనే లేచివెళ్ళినట్టున్నారు. నాటకము పూర్తిగా చూశారా డాక్టర్?

మూర్తి: తల నొప్పిగావుండి వచ్చేశాను.

రంగా: ఆ కుర్రాడెవరో ఎంత గొప్పగా యాక్టుచేశాడు డాక్టర్!

మూర్తి: Yes.

రంగా: ఇయాగోపాత్ర ఎందరో అభినయించడం చూశాను. కాని-అంత చక్కగా....అంత గొప్పగా....అంతహాయిగా....ఆ గెశ్చర్, ఆ డెలివరీ, అ మువ్‌మెంట్, ఆ ఇంటర్ ప్రెటేషన్....

మూర్తి: Yes, Yes, Yes. ఒప్పుకున్నాం మహాశయా.

రంగా: డాక్టర్? జబ్బుగా వున్నారా?

మూర్తి: Who told you. నా జబ్బు నాకు తెలీదా?

రంగా: సిగరెట్టు కాల్చండి.

మూర్తి: Thank you-

రంగా: డాక్టర్! ఆ సుబ్రావు కొన్నాళ్ళు మీ దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్నాడనుకుంటాను. అతన్ని డిస్‌ఛార్జి చేశారా డాక్టర్?

మూర్తి: మీరు అనవసర పరిశోధనలతో పనిచేశారనుకుంటాను. అక్కడ మిమ్మల్ని డిస్మిస్ చేస్తే మీ తెలివితేటలు చూపించటానికి ఎక్కడా చోటుదొరక్క నా దగ్గరకొచ్చారనుకుంటాను.

రంగా: అలా కోప్పడతారేం డాక్టర్? ఇందులో ఏముంది?

మూర్తి: చాలావుంది.

రంగా: ఏమీలేదు. పత్తిగింజలో పుయ్యపుగింజ. ఎవరికైనా వారికే భయపెడుతుంది డాక్టర్.

మూర్తి: మీరు దయచేసి వెడతారా?

రంగా: వెళ్ళమంటే వుంటానా? రేపు క్లబ్‌కొస్తారుకదూ, టెన్నిస్‌కోర్టులో కలుసుకుందాం.... ఎందుకైనా మంచిది? ఒక విషయము చెప్పనా?

మూర్తి: Shut up, get out.

[రంగారావు వెడతాడు]

మూర్తి: Dirty Rascal !

[జనార్ధనరావు వస్తాడు]

జనా : ఎవర్రా వాడు!

మూర్తి: రంగారావు - క్లబ్ సెక్రటరీ.

జనా : ఏమంటాడు?

మూర్తి: ఏమిటో వెధవ. నోటికొచ్చినట్లు వాగాడు.

జనా : తల్లిని-దండ్రిని నేనేరా. నాతో చెప్పరా నాయనా! నాతో చెప్పు.

మూర్తి: చెప్పడాని కేముందినాన్నా?....

నేనొక పడుపుగత్తెను ప్రేమించాను. ఒక పడుపుగత్తెను వివాహము చేసుకొన్నాను. ఒక పడుపుగత్తెతో సంసారము చేస్తున్నాను. ఇది నా ఇష్టమై నేను చేసిన పని. యిందులో ఎవరికీ జోక్యం అక్కర్లేదు. అందరికీ ఈ విషయంలో యింత శ్రద్ధేమిటో నాకు అర్థం కావటంలేదు. పోనీ, నేనొక గొప్పయింటి ఆడబిడ్డను పెళ్ళిచేసుకుంటే కన్నుకుట్టిందనుకోవచ్చు. నేను పెండ్లాడింది వట్టి బజారుపిల్ల, కాని నాదృష్టిలో అది దేవత. ఈ పిల్లకోసం కులం, కుటుంబం, గౌరవము అన్నీ బలిచేస్తున్నాను. నన్ను నేనే బలిచేసుకుంటున్నాను. అంతా కుట్రపన్నుతారా? అందరూ శత్రువుకింద చూస్తారా నన్ను? నేనేం పాపం చేశానని? ఎవరి భార్యను లేవనెత్తుకవచ్చానని? నన్ను వంటరివాణ్ని చేసి ఆ క్లబ్‌లో గుసగుసలాడి నాకు తలవంపులు చేస్తారా? రాస్కెల్స్. ఈ రంగారావు - క్లబ్ సెక్రటరీ. వీడుమటుకు వీడు - ముగ్గురు పెళ్ళాలు వరుసగా లేచిపోతే, ఎవతె మొల్లోనూ ముడిపెట్టే దిక్కు లేక, దిక్కులేని దినాసిలా ముష్ట్యాటలా వండుకతింటున్న వెధవ వీడు - నాముందు ఇష్టం వచ్చినట్టు పేలిపోతాడా? నా కాంపౌండర్సు, నా వార్డర్సు, నా నర్సులు, అందరూ-అందరూ కుట్ర పన్నారు. Dirty Beggars !!!

జనా : నాకు తెలుసుబాబూ! నాకు తెలుసు.

మూర్తి: నరసన్నా! (నరసన్న వస్తాడు)
నా బెడ్డింగ్ సర్దు.

నర : అయ్యా. (లోనికి పోతాడు)

[శ్యామల, చిన్న వస్తారు]

శ్యామ: ఎక్కడికండీ?

మూర్తి: మన బంగళాకు.

జనా : బాబూ!

మూర్తి: రెండురోజుల్లో వస్తాను. రెండు రోజులు. అంతే. ఈ రెండు రోజులూ శ్యామలను ఎప్పటిలా చూసుకోండి. చిన్నా! వస్తానమ్మా.

చిన్న : అన్నయ్యా!

మూర్తి: రెండురోజులు మన బంగళాకు వెళ్ళివస్తానమ్మా. మీ వదిన్ని కనిపెట్టివుండు.

చిన్న : రెండు రోజుల్లో తప్పకుండా వస్తావా-

మూర్తి: తప్పకుండా వస్తానమ్మా.

చిన్న : రాకపోతే నేనూ, వదినా వస్తాం.

మూర్తి: అలాగే రండమ్మా! నరసన్నా! డ్రైవరును కారు సిద్ధం చేయమను.

[జనార్ధనరావు చిన్నను తీసుకొని లోనికి పోతాడు]

శ్యామ: నామీద ఇలా కసితీర్చుకుంటున్నారా?

మూర్తి: కసికాదు శ్యామలా! ఒక్క రెండురోజులు మన మనశ్శాంతికోసం ఒంటరిగా వుండివస్తాను.

శ్యామ: ఈ ఇంట్లో ఒంటరిగా వుండగలనా? నన్నూ తీసుకెళ్ళండి.

మూర్తి: క్షమించు శ్యామలా! ఒక్క రెండురోజులు ఒంటరిగా వుండనీ. ఈ రెండురోజులు ఏ తుఫాను లేకుండా చూడు.

శ్యామ: ఏ క్షణాన ఏం ముంచుకొస్తుందో, మీరు రెండు రోజుల్లో రాక పోతే....

మూర్తి: నీవు రా శ్యామలా....మనం....

నర : (వచ్చి) కారు రెడీ అయ్యగారూ.

మూర్తి: శ్యామలా వస్తాను.

[నరసన్న, మూర్తి వెడతారు. శ్యామల సోఫాలో వాలిపోయి చేతుల్లో ముఖం దాచుకుంటుంది....కుమార్ వస్తాడు]

కుమా: ఏడ్చి లాభంలేదు....నవ్వితే ఆరోగ్యం.

శ్యామ: నీవా!

కుమా: నేనే చిట్టీ!

శ్యామ: ఇంకా ఇక్కడెందుకున్నావ్?

కుమా: ఎందుకున్నాను నీ వెందుకున్నావో నేనూ అందుకే ఉన్నాను.

శ్యామ: నామీద ఆశ వదల్లేదా?

కుమా: ఆశ వదిలితే అన్నీ వదిలినట్టే చిట్టీ!

శ్యామ : వదలకపోతే అది నీ అంతు చూస్తుంది.

కుమా : అందరి అంతూ చూస్తుంది.

శ్యామ : కుమార్! నీకు ఆఖరిసారిగా చెబుతున్నాను. నాదోవన నన్ను పోనీ. నా బ్రతుకు నన్ను బ్రతకనీ.

కుమా : నీదోవా నాదోవా ఒకటే చిట్టీ. నీ బ్రతుకూ నా బ్రతుకూ ఒకటే చిట్టీ, మనదోవలూ మన బ్రతుకులూ వేరుకావు.

శ్యామ : (బ్రతిమాలుతూ) కుమార్! నీ చిట్టిసుఖం నీవుచూడలేవా? నీ చిట్టి ఒక ఇంటిదయితే నీవు సహించలేవా? నీ చిట్టి బ్రతుకులో నిప్పు పెట్టి నీవేం సుఖిస్తావు? నీ చిట్టికోసం ఈమాత్రం త్యాగం చేయలేవా? నీదోవన నీవు వెళ్ళు కుమార్.

కుమా : అప్పుచిట్టీ! అనిపించావే మొత్తంమీద- ఆరితేరిన ఆడపిల్లవని!

శ్యామ : కుమార్!

కుమా : చిట్టీ! ఒకడుట, బ్రతుకుమీద రోతపుట్టి చనిపోదామని విషము తాగాడట. కాని చనిపోలేదట. అప్పుడు నీలాంటి ఒక ఆడపిల్ల దగ్గరకెళ్ళి దాని కన్నీరు ఒక బొట్టు తాగేసరికి తక్షణం చచ్చి సరాసరి స్వర్గానికి వెళ్ళాట్ట. ఈచిత్రం చూచావా చిట్టీ!

శ్యామ : కుమార్.

కుమా : పిచ్చిపిల్లా! నిన్ను నీవు మోసంచేసుకుంటూ ఎంతకాలం బ్రతుకుతావు? పిచ్చికాకపోతే పడుపుకత్తెవు నీకు కాపరమేమిటి! చేప నీళ్ళల్లో ఈదుతుంది. కాని గాలిలో ఈదుతుందా చిట్టీ! చిట్టీ! ఒక విషయం ఆలోచించు, నేను నీ సుఖానికి అడ్డంవస్తానంటున్నావు

సరే– నీమాట ప్రకారం నిన్ను వదిలివెళ్తానులే. తరువాత ఆ డాక్టరు నీతో కాపురం వెలిగిస్తాననుకొంటున్నావా? పట్టి భ్రాంతి చిట్టీ! తేలిక బోనులో ఎలుకలా చిక్కుకున్నాడు! చిట్టీ! నీవు ఒక్క చెప్పు. పరువుగల పెద్దమనిషి ఒకణ్ని చూపమని పదిరోజులు నీవంటి ఆడదానితో కాపురం వెలిగించినట్టు నాకు చూపించు. నేనంటాన్? అన్నిటికీ తెగించినరకం. ఈ ఉదారపురుషుల మంటావు, చూడాన్–వీళ్ళది అదోతరహా చిట్టీ? ఆ డాక్టరు చూడు నిజంగా ధైర్యం వున్నవాడయితే ఆ బంగళాకు ఎందుకు వెళ్ళాలి చెప్పు? భయస్థుడు. తనకు తనే విరోధి చిట్టీ. చిట్టీ! గాలిదీపం పెట్టకు, నామాట విను.

శ్యామ: నీవువెళ్ళు. ఆయన మనస్సు నీకు తెలీదు.

కుమా: నీవు మహా కనిపెట్టేశావే! చిట్టీ! వెటకారాని.... మనలోమాట– నీ భర్త లేదుగా.

శ్యామ: కుమార్!

కుమా: చిట్టీ! నా మాటవిను. నీవు నాకోసం నేను నీకోసం పుట్టామనిచిట్టీ! నేనూ నీవూ ప్రేమించుకొన్న తొలిక్షణాలు జ్ఞాపకంలేదా? ఆ మధురక్షణాలు మరచాననుకుంటున్నావా చిట్టీ! ఆ క్షణాలు ప్రశాల్లా యింకా నాలో నెలవేసుకున్నాయి చిట్టీ!

శ్యామ: నీ మనస్సు కుళ్ళింది.

కుమా: చిట్టీ! నన్నర్థంచేసుకో. నామాటవిను. నీ అందం నన్ను మోసం చేసింది. మనస్సునూ వయస్సునూ మత్తెక్కించే నీ అందం

నన్ను మోసంచేసింది. నీకోసం బ్రతుకంతా బ్రహ్మలు చేసుకున్నాను. చిట్టీ, నీకూ నాకూ మధ్య దారిద్ర్యం అడ్డుగోడ కట్టింది. నిన్ను లోకానికి విక్రయించాననుకున్నావు కదూ? ఆ రోజు నేనెలా వేగిపోయానో, నాహృదయం ఎలా దహించుకుపోయిందో నాకే తెలుసుచిట్టీ! నామాటవిను చిట్టీ! చిట్టీ!

శ్యామ: కుమార్!

కుమా: చిట్టీ! నీవు నాసొత్తు, నా దానివవు. పద.

శ్యామ: రోగ్ (లెంపకాయ కొట్టును)

కుమా: అమ్మచిట్టీ! (బయటకు వెడతాడు)

[శ్యామల నిశ్చలంగా గంభీరురాలవుతుంది]

కుమార్ గొంతు: గాలిలో దీపంపెట్టకు.
గాలిలో దీపంపెట్టకు. గాలిదీపం ఆరిపోతుంది. దిగజారేమెట్లు ఎగబ్రాకలేవు. వెళ్ళిపో! వెళ్ళిపో! వెళ్ళిపో!

శ్యామ: ఎక్కడికి వెళ్ళను? ఎక్కడికి వెళ్ళను?

కుమార్ గొంతు: ఎక్కడికైనాసరే, దిక్కులేనివాళ్ళకు దిక్కులన్నీ దిక్కులే వెళ్ళిపో....

[శ్యామల బయటకు వెళ్ళిపోతుంది]

జనార్ధనరావు గొంతు: అమ్మా శ్యామలా! మా బ్రతుకులకు ఆధారం నీవేనమ్మా. ఇన్నాళ్ళు నీ రాకకోసమే కనిపెట్టుకున్నానమ్మా. మా అబ్బాయిని నీవే కనిపెట్టి వుండాలమ్మా! మా వంశాన్ని వెలిగించాలమ్మా! మా బ్రతుకులకు ఆధారం నీవేనమ్మా

చిన్నగొంతు: వదినా జడెయ్యవూ? వదినా! పూలుపెట్టవూ? వదినా! అన్నం పెట్టవూ?

నరసన్న గొంతు: అమ్మగారూ!

మూర్తి గొంతు } నాకు కావలసింది నీవు - నీ చరిత్ర కాదు. అందరూ నన్ను నిందించనీ, వెలెయ్యనీ, తరిమికొట్టనీ - ఈ ప్రపంచం కొసకైనా నీతోనే వస్తాను. నన్ను ఒంటరిగా వదలి వెళ్ళకు శ్యామలా! వెళ్ళను. వెళ్ళను శ్యామలా!

శ్యామ: డాక్టర్! (అంటూ లోనికి పోబోతుంది)

కుమార్ గొంతు } ఆగు, చెడ బుద్ధుల బ్రతుకదు. నీళ్ళలోకి పద. ఈ డాక్టరు నీతో సంసారం చేస్తాడనుకోకు. పరువుగల పెద్దమనిషి ఎవడూ పతితురాలితో జీవించడు. వెళ్ళు నీవు వెడితే ఈ డాక్టర్ నిన్ను మరచిపోతాడు. సుఖిస్తాడు. అతని జీవితం నుంచి తొలగిపో. తొలగిపో. పో.

[శ్యామల బయటకు వెళ్ళబోతుంది. చిన్న పరుగెత్తుకొనివచ్చి శ్యామలకు అడ్డుపడుతుంది.]

చిన్న : వదినా! వదినా! ఎక్కడికి వదినా? నేనూ వస్తాను వదినా! వదినా!

శ్యామ: చిన్నమ్మా నీకు తెలియదమ్మా. నీవు ఇంట్లోకి వెళ్ళమ్మా. మళ్ళీ వస్తానుగా. నీకు తెలీదు. ఇంట్లోకి వెళ్ళమ్మా.

చిన్న : వదినా! వదినా! మమ్మల్ని వదిలిపోతావా? నేనూ వస్తా. నాన్నా! నాన్నా! వదిన వెళుతోంది నాన్నా, నాన్నా, (అరుస్తుంది)

[జనార్ధనరావు పరుగెత్తుతూ వస్తాడు.]

జనా : అమ్మాయ్ శ్యామలా! ఆగు.

శ్యామ : నన్ను వెళ్ళనివ్వండి మామయ్యా! నన్ను వెళ్ళనివ్వండి. నన్ను ఆపకండి. నాదోవన నన్ను వెళ్ళనివ్వండి. ఇది నేను వుండదగిన చోటుకాదు మామయ్యా. నాదే పొరపాటు. గాలిలో దీపంపెట్టి నిలుస్తుందనుకున్నాను. పెట్టరానిగడప మెట్టాను. నాదేతప్పు. ఈ ఇంట్లోవుండే అర్హత నాకులేదు. అమావాస్యలాంటి నా బ్రతుకులో యీ నాలుగు రోజులు మెరుపుతీగ అనుకుంటాను. మరచిపోతాను. నాకోసం మీ బ్రతుకులు ధ్వంసం చేయలేను. వారికి మనశ్శాంతి లేకుండాచేసి ఏం సుఖించను? వారిని సుఖపడనివ్వండి. నన్ను తొలగిపోనివ్వండి మామయ్యా! నన్ను మరచిపోండి.

[జనార్దనరావు కౌగలించుకుని ఏడుస్తుంది.]

చిన్న : వదినా!

జనా : లే అమ్మా, లే. నాకంతా తెలుసు. నీ కడుపులో బాధంతా నాకు తెలుసమ్మా. లే తల్లీ! నామాట వినమ్మా. లోపలికి పద.

శ్యామ : నన్ను వెళ్ళనివ్వండి.

జనా : వెళ్ళడానికి ధైర్యం అవసరంలేదమ్మా! ఉండటానికే ధైర్యం కావాలి. నాకంతా తెలుసమ్మా. పెద్దవాణ్ని-నామాట వినమ్మా. నా మాటవిను తల్లీ. మా బ్రతుకులకు ఆధారం నీవేనమ్మా! నాకోసం, ఈ చిన్నకోసం, వాడికోసం-నీవు ఉండాలమ్మా. నీవు లేకపోతే వాడి బ్రతుకు ధ్వంసం అవుతుందమ్మా. పిచ్చితల్లీ! బ్రతుకు ఒకసారి పాడయిందని ఎప్పుడూ పాడవుతుందా? కూలిన ఇంటిని మళ్ళీ కట్టుకోగలం తల్లీ! బ్రతుకును మనం మనుష్యులం మార్చుకోవచ్చమ్మా. పరిస్థితులను మనం జయించాలమ్మా. నా మాటవిను. పద లోపలికి.

[శ్యామల వెళ్ళడానికి ప్రయత్నిస్తుంది]

చిన్న : అమ్మా !

[శ్యామలను గట్టిగా పట్టుకొని ఏడుస్తుంది]

శ్యామ : చిన్నమ్మా!

చిన్న : వదినా! వెడతావా?

[వెర్రిగా చూస్తుంది]

జనా : అమ్మా! శ్యామలా! నా మాట విను. చిన్న నాకెలాంటిదో నువ్వూ నాకు అలాంటిదానివేనమ్మా! నువ్వూ, చిన్నా, వాడూ. మీ ముగ్గురే నమ్మా నా బ్రతుకులో బంధాలు. ఈ వృద్ధాప్యంలో మీ క్షేమం తప్ప నేను కోరేదీ, కోరతగినదీ ఏమీలేదు. ఎన్నాళ్ళ క్రితమో ఈ భవనంలో అస్తమించిపోయిన ఆనందదీప్తిని మళ్ళీ వెలిగించావు. మళ్ళీ మా బ్రతుకుల్లో చీకట్లు కమ్మిస్తానంటావా? మమ్మల్ని అనాథల్నిచేసి వెళతానంటావా?

శ్యామ : మామయ్యా !!

జనా : నమ్ము నమ్మా. కష్టం, నష్టం నాకు తెలియనివికావు. నేను ఎన్నో బాధలు, గాథలు చూచానమ్మా. ఇది నీకేకాదు, నాకు అగ్నిపరీక్ష. నీకోసం నా పంచప్రాణాలతో కోటకడతాను. ఎండిపోయిన నీ బ్రతుకులో నూతన వసంతాన్ని సృష్టించటానికి నన్ను నేనైనా దగ్ధం చేసుకుంటాను. పద నామాట విను. లోపలికి పద-పద.

[తెర]

శ్యామ: అలా చూడకండి. అలా చూడకండి. నాకు భయమేస్తోంది. నన్ను చంపండి, కాని అలా చూడకండి.

మూర్తి: (విగ్గరగా) You dirty bitch, Get out.

[తోసేస్తాడు]

శ్యామ: Bitch ! ఆ విషయం మీకూ నాకూ తెలుసు. సీతనని, సావిత్రి నని, దమయంతినని మిమ్మల్ని మభ్యపెట్టలేదు. మీ కళ్ళకు గంతలు మీరే కట్టుకున్నారు.

మూర్తి: Shut up. ఎవరిముందు మాట్లాడుతున్నావో తెలుసా?

శ్యామ: తెలుసు డాక్టర్! ఒక తోవనుపోయే అనాథురాలికి ఆశ్రయమిచ్చి, ప్రేమించానని చెప్పి, పెళ్ళిచేసుకుని, ఆ అనాథ యువతిని తెలియ గానే తన పరువు, ప్రతిష్ఠ, గౌరవం నశిస్తాయని భయపడి తన్ను తాను నిభాయించుకోలేని ఒక పిరికిపందతో మాట్లాడుతున్నాను డాక్టర్!

మూర్తి: నా కుటుంబం ఎలాంటిది? నా తల్లి, తండ్రి, గౌరవం, పరువు ప్రతిష్ఠ, అంతస్తు ఆలోచించావా? నన్నెంత మోసంచేశావ్?

శ్యామ: మీ తల్లి, మీ తండ్రి, మీ కుటుంబం, మీ పరువు, మీ ప్రతిష్ఠ, మీ అంతస్తు, మీ విజ్ఞానం, అన్నిటికంటె అధికమయింది ఆ రాత్రి మీరు నాకిచ్చిన ఆశ్రయం డాక్టర్! మీరు నాకిచ్చిన ఆశ్రయం. అదే మన బ్రతుకుల్లో ఎడతెగనిబంధం. డాక్టర్ అది ఒకప్పె అమర బంధం. మంచికి మంచిచేయడం మామూలే డాక్టర్! చీకట్లో నే దీపం అవసరం.

మూర్తి: శ్యామలా! నన్ను కలవరపెట్టకు. వెళ్ళు.

మూర్తి: వెల్. అన్ని దేశాల్లోకి ఏ దేశం బాగుందిరా నరసన్నా?

నర : నాకేం తెలుస్తాదిబాబూ! తమరు సీమకెళ్ళొచ్చినోరు.

మూర్తి: సీమలో ఏముందిరా చింతకాయపచ్చడి.

నర : ఇంటికెళదాం బాబయ్యా-మనం వచ్చి రెండురోజులై పోయింది.

మూర్తి: ఇల్లు—ఎందుకు యింటికి?

నర : అమ్మగారు, నాన్నగారు, చిన్నమ్మ అంతా కనిపెట్టుకుని వుంటారయ్యా!

మూర్తి: ఏ అమ్మగారు?

నర : మన అమ్మగారేనయ్యా!

మూర్తి: మన అమ్మ చనిపోయి చాలారోజులయిందిగా నరసన్నా!

నర : శ్యామలమ్మగారయ్యా.

మూర్తి? What ?

నర : శ్యామలమ్మగారయ్యా.

మూర్తి: Shut up. శ్యామలమ్మగారు ఎవరో తెలుసా?

[శ్యామల ప్రవేశిస్తుంది]

నర : అమ్మగారయ్యా.

శ్యామ : నరసన్నా! నీవు అవతలకు వెళ్ళు.

[నరసన్న వెళతాడు]

[శ్యామల మూర్తిని సమీపిస్తుంది. అతను ముఖం తిప్పుకుంటాడు. టేబుల్ మీద సీసా, గ్లాసు చూస్తుంది]

శ్యామ: తాగుతున్నారా?

మూర్తి: ఏం తాగితే?

శ్యామ: ఆరోగ్యం చెడుతుంది.

మూర్తి: చెడనీ.

శ్యామ: ఇక రండి, ఇంటికి వెడదాం.

మూర్తి: ఇల్లూలేదు, వాకిలీలేదు.

శ్యామ: రండి. ఇంటికి రండి. నామాట వినండి. మిమ్మల్ని మీరు హింసించుకుని, నన్ను ఎందుకు హింసిస్తారు చెప్పండి.

[మూర్తి శ్యామలవంక తీక్షణంగా చూస్తాడు.]

శ్యామ: మీకు తెలియకుండానే మీరీ సుడిగుండంలో చిక్కుకున్నారు. ఇందులో మీ తప్పులేదు. తప్పంతా నాదే. కాని ఆశ—ఆశను జయించలేకపోయాను. పాత జీవితానికి సమాధి కట్టి కొత్త జీవితానికి పాదుచేద్దామనుకున్నాను. ఒకవ్యక్తితో నరకానికి ప్రయాణం చేశాను. అధోలోకానికి మెట్టు దిగాను. మీవల్ల మళ్ళీ కొత్త జన్మ ఎత్తుదామనుకున్నాను. జీవితానికి పునర్జన్మ ఉందనుకున్నాను. ఇంతలో యీ ముసురు ముంచుకొచ్చింది. ఈ పాతికేళ్ళ పాడు బ్రతుకులో సుఖం, దుఃఖం రెండూ అనుభవించాను. ఇక నేను కోరేది ఏమీలేదు. కాని, నాకు ఒకటే చింత, మీ సుఖం చెడగొట్టింది నేను. మీ సుఖాన్ని నిలబెట్టాల్సింది నేనే. రండి, నామాట వినండి. రండి.

[మూర్తి కాళ్ళు పట్టుకుంటుంది]

[మూర్తి తీక్షణంగా చూస్తాడు]

నాలుగవ రంగం

[డాక్ బంగళా తెరిచేసరికి మూర్తి కొద్దిగా తాగివుంటాడు.
టేబుల్‌మీద సీసా, గ్లాసు. నరసన్న బయట వుంటాడు]

మూర్తి: నరసన్నా!

నర : అయ్యా!

మూర్తి: కూర్చో.

నర : (క్రింద కూర్చుంటాడు)

మూర్తి: కుర్చీమీద కూర్చోవోయి పిచ్చినాగన్నా!

నర : బాబయ్యా!

[సందేహిస్తాడు]

మూర్తి: నో బాబు, నో అయ్య, అంతా Equels. కూర్చో నరసన్నా!
నీవు చాలాదేశాలు తిరిగావుకదూ?

నర : తిరిగా బాబయ్యా.

మూర్తి: ఏ ఏ దేశాలు తిరిగావు?

నర : ఉత్తరాది, దక్షిణాది అంతా తిరిగానయ్యా. పెళ్ళాంచచ్చిన యెనక
పిచ్చెత్తినట్టయి తంబురా పట్టుకుని రామేశం, కాశీ....

శ్యామ: రండి. నామాట విని ఇంటికి రండి. మీ నాన్నగారికోసం, చిన్నమ్మ కోసం రండి.

మూర్తి: శ్యామలా! నీవు వెళ్ళు. నామాట విను. నా మనస్సు నా చేతుల్లో లేదు. నన్ను వదిలివెళ్ళు. నన్ను ఒంటరిగా ఉండనీ. నా మనస్సు అర్థంచేసుకో. నాచేతిలో నేనే కీలుబొమ్మనయిపోయాను. శ్యామలా! నీవు వెళ్ళు....సరసన్నా!

సర : (వస్తాడు)

మూర్తి: అమ్మగారిని ఇంటికి తీసుకునివెళ్ళు. శ్యామలా! వెళ్ళు.

[తను స్వయంగా బయటకు సాగనంపుతాడు. తిరిగి వచ్చి చేతుల్లో తలదాచుకుంటాడు]

[ఒక వికృతమైన కంఠస్వరం వినిపిస్తుంది]

స్వరం: డాక్టర్! డాక్టర్! డాక్టర్!
నీవు కీలుబొమ్మవు డాక్టర్!
నీవు కీలుబొమ్మవు డాక్టర్!
నీ భార్యచేతుల్లో కీలుబొమ్మవు డాక్టర్!
ఒక మదపుగత్తె ఆడించే కీలుబొమ్మవు డాక్టర్!
నీ చదువు, నీ సంస్కారం, నీ సంపత్తి, నీ అంతస్తు ఎలాంటిది?
ఆలోచించుకో డాక్టర్!
నీ తండ్రి కడుపులో చిచ్చుపెట్టి నీవేం సుఖిస్తావు?
డాక్టర్! ధైర్యం తెచ్చుకో.

ఎవతో ఒక అనాథకు ఆశ్రయం ఇస్తే, అది నీ భార్య అవుతుందా
డాక్టర్! నిన్ను కీలుబొమ్మలా ఆడిస్తుందా డాక్టర్!
డాక్టర్! పిచ్చి మానుకో.
మళ్ళీ పెళ్ళిచేసుకో.
దాన్ని వెళ్ళగొట్టు. తెలిక కాలుజారావు. బయటపడరా.
డాక్టర్: డాక్టర్! డాక్టర్!

మూర్తి: నరసన్నా!

[భీకరమైన వికటాట్టహాసం వినిపిస్తుంది]

Shut up....ఎవరది?

[కుమార్ ప్రవేశిస్తాడు. నల్లదుస్తులు ధరిస్తాడు]

మూర్తి: నీవు....

కుమా: నేనే డాక్టర్!

మూర్తి: మళ్ళీ వచ్చావా? రోగ్!

కుమా: ఎప్పుడూ మీతోనేవున్నా డాక్టర్! మీరు గుర్తించలా.

మూర్తి: ఇక్కడి కెందుకొచ్చావ్? వెళ్ళు.

కుమా: మీ క్షేమసమాచారాలను విచారించిపోదామని వచ్చాను డాక్టర్!

మూర్తి: విచారించావుగా, వెళ్ళవూ?

కుమా: విచారణ పూర్తికాలేదు డాక్టర్!

[కుర్చీమీద కూర్చుంటాడు]

డాక్టర్! మీరు నన్ను మీ డ్రైవర్-కుమార్ అనుకున్నారు కదూ?

మూర్తి: అయితే ఎవరు నీవు?

కుమా : అతన్నే. కాని, పూర్తిగా అతన్నికాదు, అతన్ని కాకపోనూలేదు. అసలు నేను మీ సిడను డాక్టర్! అందుకనే నల్లదుస్తులు వేసు కున్నాను చూడండి.

మూర్తి: వట్టిమోసం నీది.

కుమా : నేను మోసగాణ్ణికాదు డాక్టర్! మనం బ్రతికే బ్రతుకే మోసం.

మూర్తి: ఇప్పుడు నీ మాటలు వినలేను. నాకు విశ్రాంతి కావాలి.

కుమా: ఒక్క అయిదు నిముషాల్లో వెళ్ళిపోతాను. తరువాత మీ ఇష్టం వచ్చినంతసేపు విశ్రాంతి తీసుకోవచ్చు. డాక్టర్! మీరు కుమార్ చెడ్డవాడనుకున్నారుకదూ!

మూర్తి: వాడు రోగ్.

కుమా: నామాట వినండి. వాడు రోగ్‌కాదు. పైగా ఈ ప్రపంచంలో వాడొక్కడే నిజంగా మీ మంచికోరే ఏకైక మిత్రుడు.

మూర్తి: అంటే?

కుమా: వాడొచ్చి నిజం చెప్పకపోతే మీకు తెలిసేదేనా ?

మూర్తి : కాదు.

కుమా: అంటే మీరు అజ్ఞానంలోపడి కొట్టుకుంటూ ఉండేవారు. మీ భార్య మహాఇల్లాలని అనుకుంటూ ఉండేవారు. అజ్ఞానంలో సుఖం ఉంటుందా డాక్టర్? వాడొచ్చి మిమ్మల్ని ఒక పాపంనుంచి లేవ దీశాడు. మీ అజ్ఞానం పోగొట్టాడు. మీకు వెలుగు చూపించాడు. కాని ఆ వెలుగు చూడలేక అవస్థపడుతున్నారు. మీ గౌరవం

కాపాడుకోమన్నాడు. ఇదంతా మీకోసమే. అలాంటివాడు మీ శ్రేయోభిలాషి కాక మీ శత్రువెలా అవుతాడు డాక్టర్?

మూర్తి: వాడు స్కాండల్ మాంగర్.

కుమా : అబద్ధం నిజమనీ, నిజం అబద్ధమనీ ప్రచారం చేస్తే అది స్కాండల్ అవుతుంది. కాని, నిజం బయటపెట్టడం స్కాండల్ కాదు డాక్టర్! నిజంగా కుమార్‌కి మీరంటే ఎంత జాలో చూడండి! మీలాంటివారు ఒక బజారుపిల్లతో సంసారం చేస్తుంటే నలుగురూ చూచి నవ్విపోతారనేకదూ వాడు మీ కా నిజం చెప్పింది. కాని, మీరు ఒక పెద్ద పొరపాటు చేశారు డాక్టర్?

మూర్తి: ఏమిటి?

కుమా : నిజంగా శత్రువయిన శ్యామలను మిత్రురాలనీ, మిత్రుడైన కుమార్‌ని శత్రువనీ పొరపాటుపడ్డారు. మీరు శ్యామలను వెళ్ళగొట్టి కుమార్‌కు శరణ్యం యివ్వడానికిబదులు, కుమార్‌ను వెళ్ళగొట్టి శ్యామలకు శరణ్యం యిచ్చారు. ఇక్కడే తప్పులో కాలు వేశారు డాక్టర్! కుమార్ ఈ విషయం మీతో చెప్పిరమ్మంటే వచ్చాను. తన తప్పుంటే క్షమించమన్నాడు, ఏదో మానవసహజమైన బలహీనతవల్ల మీరుచేసిన తప్పును దిద్దుకోడానికి యింకా సమయం మించిపోలేదన్నాడు. డాక్టర్! తప్పులనేవి అందరికీ వుంటాయి. కాని వాటిని దిద్దుకోవడమే మానవుల ప్రత్యేకత. ఇక మీ ఇష్టం. సెలవామరి.

మూర్తి: ఇప్పుడే వెడతాను. దాన్ని ఇంటినుంచి గెంటేస్తాను.

కుమా : గెంటితే పోయేఘటంకాదు డాక్టర్! గడుసుదెయ్యం అది.

మూర్తి: పోకపోతే కాళ్ళేస్తాను.

కుమా : అదీ – ఆ నిశ్చయంమీదే నిలవండి....గుడ్‌బై.

[కుమార్ వెడతాడు. మూర్తి డ్రాయరులోంచి రివాల్వరుతీస్తాడు]

మూర్తి: చంపేస్తాను.

[బయటకు తీవ్రంగా వెళ్ళబోతాడు. తండ్రీ, చిన్న అడ్డంవస్తారు.]

జనా : ఎక్కడికిరా? ఆగు.

మూర్తి: దాన్ని చంపేస్తాను.

జనా : చంపడం సులభమే– బ్రతికించడం కష్టం.

మూర్తి: దాని విషయం నాకు చెప్పకండి. అది చెప్తే నాకు శాంతిలేదు అది లోకంలో ఏమూల బ్రతికున్నా పీడిస్తూనే వుంటుంది.

జనా : ఏంచేసిందనిరా దాన్ని చంపడం? ఏ పాపం చేసిందిరా అది? చంపడం అంత తేలికనుకున్నావా? చంపు చూద్దాం, ఎలా చంపు తావో! నన్నుచంపి దాన్ని చంపు. ముందు నన్నుచంపు. (అడ్డు వస్తాడు)

చిన్న : అన్నయ్యా! నాన్నా! (ఇద్దరిమధ్యకు వస్తుంది.)

మూర్తి: మీరు అనవసరంగా జోక్యం కలిగించుకుంటున్నారు.

జనా : అవసరంవుండే జోక్యం కలిగించుకుంటున్నాను. అశుభం శుభం ఎరు గని అమాయకురాలిని చంపుతావట్రా?

మూర్తి: అది నన్ను మోసంచేసింది. నాకళ్ళకు గంతలుకట్టింది. నన్నూ, నా వంశాన్నీ మైలపరచింది. ఇక ఏ ముఖం పెట్టుకొని నలుగుర్లో తిరగను?

జనా : నలుగురు! నలుగురు! ఈ నలుగురేరా మన కొంపకు తిప్పలు తెచ్చేది. నలుగురికి నాలుగు నాలికలు. నాలుగు నాలికలకు నాలుగు మాటలు. ఏ మాట నిజం? ఏ మాట అబద్ధం? ఎవ్వరా నిర్ణయిం చేది? ఎలాగురా నిర్ణయించేది? ఏదిరా కొలబద్దం? సంఘం,సంఘం, సంఘం అంటారు. ఏమిట్రా సంఘం అంటే? సంఘం అంటే మనచుట్టూవున్న మనుష్యులేకద్రా. మనుష్యులంతా ఒక్కమాట మీద నిలబడడం నీ వెన్నడైనా చూచావట్రా? ఇన్ని మతాలు, ఇన్ని సిద్ధాంతాలు, ఇన్ని పార్టీలు, ఇన్ని కక్షలు-వీటితో లుకలుక లాడుతుందట్రా? సంఘం మంచిని ముందు ఒప్పుకుందట్రా? వీరేశలింగం పంతులు విధవలకు పెళ్ళిళ్ళు చెయ్యడం న్యాయ మంటే ముందు సంఘం ఒప్పుకుంటట్రా? నా చిన్నతనంలో అయన్ని ఎన్నెన్ని చిత్రహింసలు పెట్టారో నేను కళ్ళారా చూశా నురా బాబూ! సంఘం భయానికి మరోపేరురా బాబూ! మనలో భయాన్నే మనం సంఘం అంటాం. ఈసంఘం వుంది చూచావ్- కట్టుకున్న భార్య చాటుమాటుగా కులటకన్నా హీనంగా చెడినా కళ్ళుమూసుకుని వూరుకొంటుంది. కాని చెడిపోయిన అమ్మాయిని కట్టుకుని బాగుపరిస్తే ఊరుకోదురా బాబూ! కళ్ళుమూసుకుని పాలుతాగే పిల్లిరా సంఘం. సంఘంకంటే మించింది అంత రాత్మరా బాబూ! అంతరాత్మ. అంతరాత్మకురా మనం తల ఒగ్గ వలసింది. అంతరాత్మరా మనకు దారిచూపేది. మైలపడినవారి నేరా మనం నిర్మలం చెయ్యాల్సింది. చీకట్లోనేరా దీపం అవ సరం.

దొంగ ఎప్పుడూ దొంగగా ఉండదురా. నేను పసితనంలో మా నాన్న జేబులో తెలీక పదిరూపాయలు కొట్టేశాను. కాని దొంగ

నైనానట్రా నేను? మానాన్న నన్ను క్షమించి మంచిచెప్పాడు. కొట్టి తిడితే తప్పకుండా దొంగనయ్యేవాడినిరా. ఒకపిల్ల విధివశాత్తు చెడితే ఇహ అది బాగుపడకూడదట్రా?

చెడును మంచితో జయించాలిరా!

బురదను నీటితో కడగాలిరా బాబూ!

పద, ఇంటికి పద — ధైర్యం తెచ్చుకో.

ఆ అమ్మాయి పాతజీవితం దగ్ధమైందనుకో.

పునర్జన్మ ప్రారంభించిందనుకో. పద.

భయం జయించు! భయం జయించు! భయం జయించు!

[మూర్తిని తీసుకుని వెళుతూండగా]

[తెర]

ఐదవ రంగం

[మూర్తి భవనం. శ్యామల ఒక్కతే వస్తుంది. కుమార్ సోఫా వెనకనుంచి లేస్తాడు]

కుమా : చిట్టీ! (చేయిపట్టుకుంటాడు)

శ్యామ : ఆఁ! (కెవ్వున కేకవేస్తుంది)

కుమా : రా. (లాగుతాడు)

శ్యామ : (విదిలించుకుని) మామయ్యా! చిన్నా! నరసన్నా!

కుమా : అంతా నీకోసం వెళ్ళారు. ఇంట్లో ఎవ్వరూలేరు. చిట్టీ! రా.

శ్యామ : చచ్చినా రాను.

[చేయి విదిలించుకుని లోనికి పోబోతుంది. కుమార్ అడ్డగిస్తాడు.]

కుమా : చిట్టీ! ఇది నీకూ నాకూ ఆఖరుదశ. ఆఖరుదశ చిట్టీ! ఆఖరుదశ— పద.

శ్యామ : జాగ్రత్త—దూరంగా ఉండు.

కుమా : నీ నీడ నీకు దూరంగా వుంటుందా చిట్టీ? నీ నీడపోతే నీవూ పోతావు చిట్టీ! చిట్టీ! మనం మనం ఒకటి. మన దోవలు ఒకటి. పద.

[శ్యామల వెనక్కు పోతుంది]

కుమా: నీ జుట్టురేగితే ఎంత అందంగా వుంది. నీ ముఖాన చెమట ఎంత అందంగావుంది. నీ కళ్ళు చింతనిప్పుల్లా, నాగుబాము నాలుకల్లా ఎంత అందంగా ఉన్నాయి, ఈ అందం నాకు కావాలి. నన్ను అనుభవించనీ చిట్టీ! చేపల్లే గిలగిలా తన్నుకోకు. నీళ్ళలోకి పద. పద చిట్టీ.

[అంటూ మీదకు పోతాడు]

వెలుపల కేకలు } తలుపులు! తలుపులు! బద్దలుకొట్టండి!

[కుమార్ తలుపువైపు పరుగెత్తుతాడు. శ్యామల వెనుక గదిలోకి పరుగెత్తుతుంది, కుమార్ కూడా వెనకగదిలోకి పరుగెత్తుతుండగా శ్యామల రివాల్వరుతో గుమ్మంలో ఎదురవుతుంది]

శ్యామ: వెళ్ళు. వెనక్కు— వెళ్ళు—నీకు అంతటితో అఖరు.

కుమా: చిట్టీ! కాల్చకుచిట్టీ! ప్రాణంతోపోనీ! ఎంత రాక్షసుణ్ణయినా, చిట్టీ!

శ్యామ: పిరికిపందలు బ్రతకటంకంటె చావటం నయం.

[కాలుస్తుంది. కుమార్ పడిపోతాడు]

కుమా: చిట్టీ!

[శ్యామల స్తంభించిపోయి చూస్తూ, పిస్టలు వదలి]

శ్యామ: కుమార్!

[అంటూ కుమార్ దగ్గరకు వస్తుంది]

[బయటివాళ్ళు తలుపులు విరగ్గొట్టుకొని లోపలికివస్తారు]

మూర్తి: శ్యామలా,

శ్యామ్: నేనే.... ....

[అప్పుడొచ్చి కుమార్ దానితో పొడుచుకుంటాడు]

కుమా: డాక్టర్! డాక్టర్! నేనే రాక్షసుని....

శ్యామ్: కుమార్!

కుమా: ఇది నా చివరికోరిక—నన్ను చెప్పని. నేనే రాక్షసుని చనిపోతున్నాను డాక్టర్! ఇందులో ఎవరి తప్పూ లేదు. డాక్టర్ నీవు శ్యామలను ప్రేమించావు. నేనూ శ్యామలను ప్రేమించాను. కాని మనం ప్రేమించిన దోవలు వేరు డాక్టర్! నీవు దేవతలా ప్రేమించావు. నేను రాక్షసుడిలా ప్రేమించాను. నీ ప్రేమ ఉన్నతమైంది డాక్టర్! శ్యామలతోపాటు శ్యామల చరిత్రనుకూడా స్వీకరించావు. శ్యామలనుచంపి నిందను భరించ లేదు. నిందనేచంపి శ్యామలను బ్రతికించావు. సంఘం చరిత్రలో ఒక క్రొత్త అధ్యాయం ప్రారంభించావు. పతితలకుకూడా జీవితంలో పరివర్తన పొందే అవకాశం ఆశ ఉన్నవని నిరూపించావ్. ఒక పెద్ద మార్పు ఎప్పుడూ ఒక బలి కోరుతుంది డాక్టర్! ఆ బలి నేనయ్యాను. ఇది నా అదృష్టం. నీవూ, శ్యామలా చల్లగా బ్రతికి, మంచిలాంటి పిల్లల్ని కని.... చిట్టీ!

[బిగ్గరగా కేకేసి శ్యామల కాళ్ళదగ్గర పడిపోతాడు]

[తెర]

19 వ ఆంధ్ర నాటక కళాపరిషత్ కళోత్సవంలో

ప్రదర్శించబడిన సందర్భంలో

23–10–55 న పాల్గొన్న నటీనటులు

మూర్తి	[డాక్టర్] :	ఎం. ఎస్. మూర్తి	వ॥	25
జనార్ధనరావు	[తండ్రి] :	కె. వి. ఎస్. శర్మ	"	50
కుమార్	:	వెంపటి రాధాకృష్ణ	"	25
రంగారావు	[క్లబ్ సెక్రటరీ]	నందూరి సుబ్బారావు	"	35
నాగయ్య	[కాంపౌండర్]	కె. ప్రసాద్.	"	40
నరసన్న	[నౌకరు]	ఎం. వి. చలపతిరావు	"	50
శ్యామల	[డాక్టర్ భార్య]	జి. నిర్మల	"	20
చిన్న	[డాక్టర్ చెల్లెలు]	బేబీ సరసు	"	10

—నిర్వహణ—

జి. వి. కృష్ణారావు

మ్యూజిక్ : రత్నారావు ఆర్కెస్ట్రా : అరుణోదయ

లైటింగ్ : వెంపటి

SRI BELLAMKONDA RAMA RAYA KAVINDRA TRUST

Do.No.12-8-5/5 NARASARAOPET. REG NO : - 112/bk - g/09.



గౌరవాధ్యక్షులు :
బ్ర॥ శ్రీ ఆచార్య బెల్లంకొండ శ్రీనివాస బాలసాయి యోగి



అధ్యక్షులు :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ వేంకట సుబ్రహ్మణ్యశర్మ



ఉపాధ్యక్షులు :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ రామలింగేశ్వరరావు



ప్రధాన కార్యదర్శి :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ నరసింహారావు



సహాయ కార్యదర్శి :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ మోహనరావు



కోశాధికారి :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ వేంకట లక్ష్మీనరసింహప్రసాద కుమార్



కార్యనిర్వాహక సభ్యులు :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ వేంకట కృష్ణ రాఘవేంద్రరావు



కార్యనిర్వాహక సభ్యులు :
బ్ర॥ శ్రీ బెల్లంకొండ సాయిరామ్